

**తారాశంకర్ వంద్యోపాధ్యాయ్**

రాయ్‌హాట్‌ను ఆనుకుని ప్రవహించే కాళిందీనది ఇవతల ఒడ్డును కోస్తూ అవతలిఒడ్డున ఒక లంకను పెట్టింది. ఆ లంక కారణంగా చాలా తగాదాలు బయలుదేరాయి. రాయ్‌హాట్ రాయ్ వంశపు జమీందారులది. రాయ్‌వంశం చాలా విస్తృతమై ఏనాడో చీలికలూ, వాలికలూ అయింది. ఇప్పుడు రాయ్ వంశీయులంతా ఆ లంకమీద తమకుగల స్వామ్యాన్ని ధృవపరచుకోవటానికి కర్రలూ, బరిసెలూ, పాత దస్తావేజులూ పట్టుకున్నారు. ఈ ఉద్యమంలో చేరిన నూటఅయిదుమందీ పరస్పరం విరోధులే. రైతులుకూడా ఆ లంకకోసం ఎగబడ్డారు. ఎంచేతనంటే, తాము సాగుచేసే భూముల్ని కోసి నది ఆ లంకను పేర్చింది. లంక ఏర్పడ్డ ప్రాంతంలో ఉన్న భూములు తమ తాకట్టులో ఉన్నాయి గనక ఆ లంకకూడా తమ తాకట్టులోదే నన్నారు వడ్డీ వ్యాపారులు.

రాయ్ వంశీయుల్లో ప్రముఖుడు ఇంద్రరాయ్. అతను ఉద్దండుడు. అతని ప్రతిపక్షంలోవాడు రామేశ్వర చక్రవర్తి. రాయ్‌లకూ, చక్రవర్తులకూ బాంధవ్యాలున్నాయి. పగలూ ఉన్నాయి. రామేశ్వర చక్రవర్తి ఈనాడు పడిపోయిన ధ్వజస్తంభం. ఆయన ఇప్పుడొక చీకటికొట్లో కూర్చుని, మంచంలో జీవిస్తున్నాడు. ఆయనకళ్ళు వెలుగు చూడలేవు. ఆయన వ్యవహారాలన్నీ యోగీశ మజుందారనే మేనేజరు చూస్తున్నాడు. రామేశ్వరుడి రెండోభార్య సునీతి శాంత విషాదమూర్తి. ఆమెకు ఇద్దరు కొడుకులు; పెద్దవాడు మహీంద్రుడు, చిన్నవాడు అహీంద్రుడు.

రైతులు ఇంద్రరాయ్ సహాయం అర్థించారు:

"మా పొలాలు నాలుగోవంతు మింగి నది అద్దరిని కక్కింది గద," అన్నారు.

"పొలాలు పోతే మీకేం నష్టం? ఉన్న పొలాలకే శిస్తు ఇవ్వండి," అన్నాడు ఇంద్రుడు మీసం మెలిపెడుతూ.

రైతులు రామేశ్వరుడి ఇంటికి వెళ్ళారు. ఇంట్లో రామేశ్వర చక్రవర్తి చిన్నకొడుకు అహీన్ మాత్రమే ఉన్నాడు. అతను సన్నగా, ఎత్తుగా ఉంటాడు. ఎర్రటి రంగు, పచ్చటికళ్ళు, పచ్చటి జుట్టు, ఇంకా స్కూలు విద్యార్థి. పదిమైళ్ళ దూరానఉన్న స్కూల్లో చదువుకుంటున్నాడు. ఆ కిందటిరోజే ఇంటికి వచ్చాడు. రైతుల మొర ఆలకించే దక్షత అతనికిలేదు. రైతులతో మాట్లాడమని తల్లినడిగితే, రాయ్‌లందరూ నవ్వరా అన్నది సునీతి. అహీన్‌కిది చాదస్తంగా కనపడింది. అతనివి ఆధునిక భావాలు అహీన్ రైతులగోడు వినక తప్పలేదు. తల్లి చాటున ఉండి ఆలకించింది.

"మేం చేసే భూములు కాళీమాత మింగేసింది; ఉర్లగడ్డలు వేసుకోవాలన్నా, చెరుకు వేసుకోవాలన్నా మాకు భూమిలేదు, రైతులెవరిదగ్గిరా గిద్దెడు గోధుమలు లేవు, శనగలులేవు. మీరే కటాక్షించాలి," అన్నారు రైతులు.

వాళ్ళు ఇంద్రరాయ్‌తో మాట్లాడితే బాగుంటుందని సునీతి సూచించింది. రైతుల ఆట కట్టయింది.

"వారి దగ్గిరికెళ్ళి లాభంలేదు, అమ్మగారూ," అన్నాడు రంగ్‌లాల్ అనే రైతు.

"లంక తమదే నంటున్నారా వారు?" అని సునీతి అడిగింది.

"వారనకపోయినా మిగిలిన రాయ్‌లందరూ అంటున్నారమ్మా. నిజానికి లంక ఇద్దరిని ఏర్పడలేదు. అది రాయ్‌హాట్‌కు చెందదు అఫ్‌జల్‌పూర్‌కు చెందుతుంది. అది పూర్తిగా మీ జమీందారీయే. ఒకవేళ రాయ్‌హాట్ పొలిమేరలోదే అనుకున్నా మీకు మూడోవంతు వాటా ఉంటుంది," అన్నాడు రంగ్‌లాల్.

"మీ రందరూ, పాపం, పేదరైతులు. ఆ లంక మీకు చెందటమే న్యాయం. అయినా నేనేమీ చెప్పలేను. మా పెద్దవాణ్ణి, మేనేజరు మజుందారునూ పిలిపిస్తాను. అప్పుడు మీరు రండి. మీకు అన్యాయం జరగనివ్వను," అన్నది సునీతి. ఆమె అహీన్‌ను ఆ సాయంకాలం ఇంద్రరాయ్‌వద్ద కొకసారి వెళ్ళి రమ్మన్నది.

* * *

రామేశ్వర చక్రవర్తి మొదటిభార్య రాధారాణి ఇంద్రరాయ్ చెల్లెలు. రాయ్‌లకూ, చక్రవర్తులకూ మూడు తరాలుగా శత్రుత్వం సాగుతున్నది. చక్రవర్తులు కులీనులు, రాయ్‌లు కొంచెం తక్కువవాళ్ళు, శ్రోత్రియులు. కులీనులకు తమ కుమార్తెలను కన్యాదానం చేసేవారు. రామేశ్వర చక్రవర్తి తాత సంపన్నురాలైన రాయ్ కన్యను పెళ్ళాడి, వారి వంశాన్ని అవమానించాడు. అలాప్రారంభమైన తగాదా, రామేశ్వరుడి తండ్రి అయిన సోమేశ్వరుడి కాలంలో చాలా తీవ్రమయింది.

సోమేశ్వరుడి కాలంలోనే బీర్భూమ్ జిల్లాలో చరిత్ర ప్రసిద్ధమైన సాంతాల్ తిరుగుబాటు జరిగింది. సోమేశ్వరుడు ఉద్రేకంతో సాంతాలీలతో చేరిపోయాడు. అతనితల్లివైపు చుట్టం తేజచంద్ర రాయ్ అధికారులకు వార్తలందిస్తూ వచ్చాడు. "రాయ్ వంశం నిర్మూలిస్తాను, రాయ్‌హాట్ నేలమట్టం చేస్తాను," అని సోమేశ్వరుడు ప్రతిజ్ఞ చేశాడు.

అతను అంతపనీ చెయ్యగలవాడే కూడానూ, యమకింకరుల్లాటి సాంతాలీలు వేనవేలుగా అతనికింద ఉండేవారు. తెల్లటి శరీర చ్ఛాయా, పచ్చని కళ్ళూ, పచ్చనిజుట్టూగల సోమేశ్వరుణ్ణి వాళ్ళు దేవుడుగా పరిగణించి, అతన్ని "రాంగాఠాకుర్" అని పిలిచేవాళ్ళు. తన పుట్టింటివాళ్ళపైన చెయ్యి చేసుకోవద్దని సోమేశ్వరుడి తల్లి కాళ్ళు పట్టుకున్నది. అతనికి తామపాము కాటు తిన్నట్టయింది. రాయ్‌ల జోలికి పోనని తల్లికి మాటఇచ్చి, ఆ రాత్రే అతను కట్టుబట్టలతోనూ, ఒకకత్తితోనూ, ఎవరికీ చెప్పకుండా ఇల్లువిడిచిపెట్టి వెళ్ళిపోయాడు.

అతనికి తెలియకుండా అతనిభార్య శైవలిని అతన్ని వెన్నంటి వచ్చింది. ఆమె తన కొడుకును విడిచి వచ్చేసింది.

"నువ్వెక్కడికి?" అనిసోమేశ్వరుడు భార్యనడిగాడు. భర్తతో బాటే తానుకూడా పట్టుబడతా నన్నది ఆమె.

సోమేశ్వరుడు కొంచెం ఆలోచించి, తన భార్యను ఒకగుడిలోకి తీసుకుపోయి అమ్మవారిముందు మొక్కమని, మొక్కినభార్యను కత్తితో నరికేసి, అరణ్యంలోకి వెళ్ళిపోయాడు. తరవాత అతను వెయ్యిమంది సాంతాలులను వెంటవేసుకుని ఒక డాకా దోచాడు, ఒకగ్రామం తగలబెట్టాడు, ఒకమిషనరీ బంగళా ధ్వంసంచేశాడు, తెల్లవాళ్ళను స్త్రీ పురుషులను హత్యచేశాడు. తరవాత సైనికులకూ సాంతాలీలకూ జరిగిన యుద్ధంలో అతను చనిపోయాడు.

అటుతరవాత ఉభయ వంశాలకూ మధ్య రాకపోకలు ఏర్పడ్డాయి. సోమేశ్వరుడి తల్లి తన మనమడైన రామేశ్వరుడికి తేజచంద్రుడి కూతురైన రాధారాణిని చేసుకున్నది

రామేశ్వరుడు గొప్పపండితుడు, మహారసికుడు. రాయ్‌వంశపు ఆడబడుచు రాధారాణి పోటీదురుసుమనిషి. వా రిద్దరికీ అస్తమానమూ కలహం సాగేది. ఒకసారి రాధారాణి భర్తమీద అలిగి పుట్టింటికి వెళ్ళింది. ప్రబంధనాయకుడిలా రామేశ్వరుడు అత్తవారింటికి వెళ్ళి, పరస్త్రీలనిక కన్నెత్తిచూడనని ప్రమాణంచేసి భార్యనుమంచి చేసుకున్నాడు.

ఇలా చాలాసార్లు జరిగింది. కాని ఒకసారి రామేశ్వరుడు భార్యను అలకతీర్చటానికి అత్తవారింటికి వెళ్ళేసరికి రాధారాణి పక్కనే ఆమె మేనత్తకొడుకు కూర్చుని ఏదో పుస్తకం చదివి వినిపిస్తున్నాడు, అతను మేనమామ ఇంటికి ఆ రోజే వచ్చాడు.

అటుతరువాత ఏమిజరిగినదీ రాధారాణికి తెలియాలి, రామేశ్వరుడికి తెలియాలి. పైవాళ్ళ కెవరికీ తెలీదు. అటుతరవాత రాధారాణి పుట్టింటిగడప తొక్కలేదు. రెండిళ్ళకూ మధ్య ఏర్పడిన సఖ్యంకూడా చెడిపోసాగింది. తరవాత రాధారాణి ఎటో వెళ్ళి

పోయింది. అక్కడికి పదిమైళ్ళ దూరానవున్న రైలుస్టేషనులో ఆమెను చూసినవారున్నారు. ఆ పైన ఆమె జాడలేదు.

ఆమె చేసినపని రాయ్‌వంశీయులకు తలవంపులు తెచ్చింది.

తరవాత రామేశ్వరుడు సునీతిని చేసుకున్నాడు. సునీతి రాయ్ వంశానికి చెందినదికాదు. ఆమెకు మహేంద్రుడూ, అహీంద్రుడూ అని ఇద్దరు కొడుకులు. వారుపుట్టాక రామేశ్వరుడి ఆరోగ్యం చెడింది. రెండేళ్ళుగా ఆయన మంచంపట్టి, చీకటిగది దాటిరావటం లేదు. అప్పుడప్పుడూ తనలోతాను మాట్లాడుకుంటాడు.

* * *

అహీన్‌ను ఇంద్రరాయ్‌వద్దకు వెళ్ళమన్న సునీతి, రాయ్ అవమానిస్తాడేమో నని సస్తాయించింది. కానీ అహీన్ అవమానాలకు జంకరాదంటూ దక్షిణాఫ్రికాలో గాంధీజీ చేసినపనులు చెప్పి, రాయ్‌ని చూడబోయాడు.

ఇంద్రరాయ్ అహీన్ను చూసి, "రామేశ్వర చక్రవర్తి కొడుకువు కాదూ?" అన్నాడు.

అతను తనతల్లి పంపిందనీ, తాను చిన్నకొడుకుననీ, టవున్లో చదువుతున్నాననీ చెప్పి, తాను లంకను గురించి మాట్లాడవచ్చానన్నాడు అహీన్.

"ఆ లంక నాది. ఆ మాట మీ అమ్మతో చెప్పు." అన్నాడు ఇంద్రరాయ్.

"చెబుతాను, రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని మా అమ్మకోరుతున్నది. ఇక నే వెళతాను."

అహీన్ లంకకేసి పోబోతున్నాడని తెలిసి, లంకనిండా పాములున్నాయనీ, వెళ్ళటం మంచిది కాదనీ ఇంద్రుడు సలహాయిచ్చాడు.

అయితే అహీన్ లంకమీదికి పోదలచలేదు. దూరంనుంచే చూడాలనుకున్నాడు. రంగ్‌లాల్ మండల్ అతనికి ఆ లంకను చూపి, దాన్నిగురించి వివరాలు చెప్పాడు.

కాళింది గ్రామాన్ని ఒరుసుకుని పారుతున్నది. దాని కవతల గడ్డీ గాదా మొలవని ఒండ్రుఇసక ప్రాంతంకొంతవున్నది. దాని కవతల లంక, లంకనిండా తుంగా, రెల్లుదుబ్బులూ, వట్టివేళ్ళ దుబ్బులూ దట్టంగా పెరిగివున్నాయి. వాటిలో రకరకాల కీటకాలూ, భయంకరమైన పాములూ నివసిస్తున్నాయి. ఒకకొండచిలువ దూడనిపట్టటమూ, దాన్ని విడిపించటానికి ఎవరూ వెళ్ళసాహసించలేకపోవటమూ రంగ్‌లాల్ అహీన్‌కు చెప్పాడు. అతను తన చిన్ననాటి జీవితం గురించీ, లంక పెరిగి పెద్దదికావటం గురించి కూడా చెప్పాడు. కాళీనది ఒడ్డునకూర్చుని అహీన్ లంకకేసి చూస్తూ ఆ కబుర్లన్నీ విన్నాడు.

లంకమీదికి ముందు అడుగుపెట్టినవాళ్ళు సాంతాలీలు. వాళ్ళు కొంతమేర అడవంతా నరికి, సేద్యం ప్రారంభించి బంగాళాదుంపలూ, మూరెడేసి బొబ్బర్లూ అద్భుతంగా పండించసాగారు. అందరి



దృష్టి లంకమీద పడటానికి సాంతాలీలే కారణ మన్నాడు ముసలి రంగ్‌లాల్.

అతను సాంతాలీలుండేచోటికి తీసుకుపోతానంటే అహీన్ బయలుదేరాడు. వాళ్ళకు సాంతాలీ స్త్రీలు కుండలతో ఎదురయారు వట్టిదుబ్బుల మధ్యగా నీటికోసం ఏటికివస్తూ. ఎత్తుగా పెరిగిన రెల్లు, వట్టి దుబ్బుల మధ్యగా సన్నదారి ఉన్నది. దుబ్బులమధ్య దట్టంగా లతలుపెరిగి అల్లుకుని ఉన్నాయి. అదంతా అడవే. కాలిదారి మాత్రం సాంతాలీల కుత్రతకు చిహ్నంగా ఉన్నది.

ఆ దారినే వాళ్ళిద్దరూ సాంతాలీల పల్లెచేరారు. దుబ్బుల అడవి మధ్య కొంతప్రదేశం ఖాళీచేసి, అందులోపది, పన్నెండు గుడిసెలు వేసుకుని ఆటవికులూ, అర్ధనగ్న శరీరాలూ అయిన సాంతాలీలు నివసిస్తున్నారు.

ఒక దృఢకాయుడు బయటికి వచ్చి, అహీన్‌ను ఎగాదిగా చూసి, అహీన్ కాళ్ళముందు సాష్టాంగపడ్డాడు. రంగాఠాకూర్ మనమణ్ణి ఆ మనిషి చూస్తూనే గుర్తించాడు. రంగ్‌లాల్ తెలియజెప్పాడుకూడా.



ఆ మనిషి పేరు మాఝీ. అహీన్ తాత సాంతాలీలతో చేరే నాటికే మాఝీ నలభై ఏళ్ళవాడు. అతని వయస్సిప్పుడు డెబ్భ య్యియిదూ, ఎనభై దాకా ఉంటుంది. అంతవయసులోకూడా ఉక్కు ముక్కలాగున్న సాంతాలీ వృద్ధుడికేసి అహీన్ ఆశ్చర్యంగా చూశాడు.

రాంగాఠాకూర్ మనమడు వచ్చాడన్న వార్తా, అతను అచ్చు రాంగా ఠాకూర్ లాగే ఉంటాడన్నవార్తా విని సాంతాలీ స్త్రీలంతా గుమి గూడారు, అందరూ నునుపు చేసిన రాతి విగ్రహాల్లాగా ఉన్నారు.

అడవిపూల వాసన కొడుతున్నది. అహీన్, అది ఏ పూల వాసన అని అడిగాడు. ఆడవాళ్ళంతా పొదల్లోకి వెళ్ళిపోయారు, వాళ్ళకు పాములభయం కూడా లేదు. ఆ రోజునే చంపిన కొండ చిలువను వాళ్ళు అహీన్‌కు చూపారు.

మాఝీ భార్య అహీనుకు నురుగుతో ఉన్న పాలుతెచ్చి తాగ టానికిచ్చింది.

"మీ మాఝీలందరు వచ్చి ఈ లంకను సాగుచేశారు. రేపు మా రైతులు వచ్చి మిమ్మల్ని వెళ్ళగొట్టి లంక ఆక్రమిస్తారు" అన్నాడు మాఝీతోంగ్‌లాల్.

"మమ్మల్నెందుకు లేవగొట్టటం. శిస్తేదో మేమేఇస్తాం", అన్నాడు మాఝీ.

"ఎవరికని ఇస్తారు? అందరూ లంక మాదంటే మాదంటున్నారు."

"మేం ఈ రాంగాబాబు గారికే ఇస్తాం. వారిని లంకగల వారి కివ్వనీ."

"లంక అబ్బాయిగారిదే. ఆయనకింకా కుర్రతనం. ఏమీతెలీదు." అన్నాడు రంగ్‌లాల్.

ఆడవాళ్ళు అడవిపూలతో తిరిగివచ్చి. పూలన్నీ అహీన్ ముందు పోశారు. వారిలో చాలా పొడుగైనపిల్ల ఒకతె ఉన్నది. ఆమె మాఝీ మనమరాలు; త్వరలో ఒక సాంతాలీ యువకుణ్ణి పెళ్ళాడ బోతున్నది. ఆమె పేరు సారి.

చీకటి పడబోతుందని అహీన్ తిరుగు ప్రయాణం అవుతూంటే సాంతాలీ యువతులు తమనాట్యం చూసి వెళ్ళాలన్నారు. మద్దెల మోగింది. వెదురు పిల్లంగ్రోవిమీద పాట వాయిస్తూంటే అర్ధచంద్రా కారంగా నిలబడి పాడుతూ నాట్యం చేశారు.

చీకటి పడనే పడింది. సాంతాలీలు కాగడాలతో అహీన్‌ను ఇంటికి చేర్చారు.

రామేశ్వర చక్రవర్తి కొడుకును సాంతాలీలు కాగడాల ఊరేగిం పుతో ఇల్లు చేర్చడటం ఇంద్రరాయ్ చూసి, అతన్ని రాంగా ఠాకూర్ మనమ డనటం చెవులారా విన్నాడు.

* * *

సునీతి దీపాలు పెట్టేవేళ మంచినూనె సీసా తీసుకుని, మేడ మీది భర్తగదికి వెళ్ళింది. ఆ గదితలుపులూ, కిటికీలూ మూసే ఉంటాయి. రాత్రింబగళ్ళు ప్రమిదదీపం వెలుగుతూనే ఉంటుంది. రామేశ్వరుడి కళ్ళు కాంతిని సహించలేవు. వత్తిదీపం ఉన్నచోట తప్పిస్తే ఆ విశాలమైన గదంతా చీకటి చీకటిగానే ఉంటుంది. సునీతి వచ్చేసరికి గదిమధ్యన ఉన్న పెద్ద పట్టెమంచంమీద రామేశ్వరుడు కూర్చుని ఉన్నాడు.

సునీతి ప్రమిదలో నూనెపోసి, బయట చీకటి పడిపోయింది గనక కిటికీ తలుపులు తెరిచింది. రామేశ్వర్ బయటి ప్రపంచాన్ని చూడాలంటే తెరిచిన కిటికీలదగ్గర నిలబడతాడు.

"స్థలం శుద్ధిచేస్తాను. బట్టలుమార్చి సంధ్యావందనం చేసు కుందురుగాని," అన్నది సునీతి.

"చెయ్యొద్దూమరీ? చెయ్యకపోతే పాపం. చేస్తేమటుకు ఏం లేదు, ఏం లేదు, ఏం లే-దు..." అంటూ రామేశ్వరుడు గొణగ సాగాడు. ఎవరో ఒకరు అడ్డం తగలకపోతే అదేమాట అలా గొణుగుతూనే ఉంటాడు. అందుచేత సునీతి అడ్డంపడి. "ఎందుకూ గొణగటం?" అన్నది.

"నేనేమీ గొణగటంలేదు, బట్టలేవీ?" అంటూ రామేశ్వరుడు జాగ్రత్తగా మంచం దిగాడు.

సునీతి కిందికివెళ్ళి కాచినపాలు తెచ్చేసరికి ఆయన సంధ్య ముగించి, కిటికీదగ్గిర నిలబడి, లంకనుంచి వినిపించే గానం వింటున్నాడు.

"సాంతాలీలు మద్దెలలు వాయిస్తూ, పిల్లంగ్రోవులూదుతూ, నాట్యం చేస్తున్నారు. అది వాళ్ళ ఆనందం," అన్నాడాయన తన భార్యతో, అని గీతగోవిందంలోనుంచి "కరతల తాల తరల వలయావలికలిత కలస్వనవంశే, రాసరసే సహనృత్యపరా హరిణా యువతి ప్రశంసే" అనే పదం చదివాడు.

"ముందీపాలు తాగండి," అన్నది సునీతి.

"గీతగోవిందం నువు చదివావా ?" అన్నాడాయన.

"నాకు సంస్కృతం రాదు. మీరెప్పుడూ చదివి వినిపించలేదు."

"ఇవాళ వినిపిస్తాను. నాకు అదంతా నోటికివచ్చు

"పనులన్నీ పూర్తిచేసి వస్తాను."

"రా... చూడూ, గీతగోవిందం వినటానికి మంచి చీర కట్టుకుని తలదువ్వుకుని రావాలి. ఇంట్లో అత్తరులేదూ...ఈ వెలుతురులోకి కాస్త వెళతావా ? ఈ చీకట్లో నిన్నునేను సరిగా చూడటమేలేదు. పాపమో, శాపమో, నాకళ్ళు పోయాయి —"

"మీకళ్ళు బాగానేఉన్నాయి. డాక్టర్లు చాలాసార్లు పరీక్షించారు."

రామేశ్వరుడు గట్టిగా, "వాళ్ళకేమీ తెలీదు, నీకూ తెలీదు, ఆ దీపాన్ని ఆర్పెయ్యి, లేదా చాటునపెట్టు, అబ్బ !" అన్నాడు.

సునీతి దీపాన్ని కాస్త చాటునఉంచి కిందికి వెళ్ళిపోయింది.

ఆమె తన భర్త వంట స్వయంగాచేసి, సబ్బుతో స్నానంచేసి, పట్టుచీరె కట్టుకుని, పరిచారిక మానదాచేత తల దువ్వించుకున్నది. మానదా తనను చూసి ఎక్కడ నవ్విపోతుందోనని ఆమె, తావిలా ముస్తాబు కావటానికి రకరకాల సాకులు చెప్పింది.

మానదా జుట్టు దువ్వుతూ, "ఎంతచక్కని జుట్టు ! చిన బాబుగారికి ఇలా నల్లటిజుట్టు రాలేదు," అనేసరికి, సునీతి గతుక్కుమని, "ఏడీ ? అహీన్ ఇంకా ఇంటికి రాలేదేం ?" అన్నది.

నీళ్ళు తీసుకురావటానికి వెళ్ళినప్పుడు చిన్న బాబునూ, రైతు రంగ్‌లాల్‌నూ ఏటిఒడ్డున చూశానని మానదా చెప్పింది.

ఇంతలో సాంతాలీల జట్టు దివిటీలతో అహీన్‌ను ఇంటికి చేర్చారు. వాళ్ళు తన చిన్న కొడుకును "రాంగాబాబు" అనటంవిని సునీతి వణికిపోయింది.

అహీన్ నవ్వుతూ ఇంట్లోకివచ్చి, "లంకంతా చూసి వచ్చానమ్మా. సాంతాలీలు ఎంత మర్యాద చేశారనుకున్నావ్," అంటూ ఉత్సాహంగా చెప్పాడు. అతని వెనకవచ్చిన రంగ్‌లాల్ వాకిలి దగ్గిర ఆగి, తాను మూటగట్టితెచ్చిన పూలను లోపల ఉంచాడు.

"సాంతాలీలు వెళ్ళిపోయారా ? మూర్ఖులు ! వాళ్ళకు కొబ్బరీ బెల్లమూ ఇచ్చి మరీపంపాలి, పిలవండి," అన్నది సునీతి. రంగ్‌లాల్ వాళ్ళను వెనక్కు పిలుచుకు రావటానికి వెళ్ళాడు.

మానదా పూలుతెచ్చి కుమ్మరించి, "వాసన ఏమిటా అనుకున్నా ! ఇవి ఏం పూలో ?" అన్నది సునీతి కూడా వాటినిచూసి ఎంతో ముచ్చటపడి, "కాసిని పూలు పట్టుకెళ్ళి నాన్నగారికిచ్చిరా," అన్నది అహీన్‌తో.



అహీన్ వెళ్ళనన్నాడు. అతను తండ్రిని తప్పించుకు తిరుగుతున్నాడు. తండ్రి వాలకంచూస్తే అతనికి ఏడుపు వస్తుంది.

సాంతాలీలకు కొబ్బరీ, బెల్లమూ ఇచ్చేపని వంటావిడకు పురమాయించి, కాసినిపూలు తీసుకుని పైకి బయలుదేరింది. ఇప్పుడు అహీన్ తల్లిని సరిగాచూసి, "ఇవాళ ఎంత చక్కగా ఉన్నావమ్మా ? రోజూ ఎందుకిలా ఉండవూ ?" అని అడిగాడు.

సునీతి ముఖం సిగ్గుతో ఎర్రబడింది. "ఇవాళ నేను రాంగాబాబు తల్లిని కాదుట్రా ? అందుకూ !" అంటూ ఆమె పైకివెళ్ళింది.

ఆమె గదిలోకి వచ్చేసరికి గదిలో దీపంలేదు. ఆమె అహీన్ను కేకేసి దీపం తీసుకురమ్మన్నది. ఆమె తన భర్తతో, "నేనేం తెచ్చానో చెప్పుకోండి. కమ్మని వాసన తెలుస్తున్నదా ?" అన్నది.

రామేశ్వరుడు భార్యమాట వినిపించుకున్నట్టు లేదు. ఆయన చిన్న గొంతుతో, "కచేరీ సావట్లో ఆ వెలుతురేమిటి ? అంతమంది జనంవచ్చారు. నన్ను పట్టుకు పోతారేమోనని దీపం ఆర్పేశా," అన్నాడు.

సునీతి ఉత్సాహమంతా దిగిపోయింది.

"వాళ్ళంతా సాంతాలీలు. మన అహీన్ను డించిపోవచ్చారు," అంటూ ఆమె నిట్టూర్చింది.

అహీన్ దీపం తీసుకుని పైకివచ్చాడు. సునీతి ఒక పూల గుత్తిని వెలుగులో పట్టుకుని భర్తకు చూపింది. రామేశ్వరుడు వాటికేసి ఆసక్తితో చూస్తూ, "కుటజాలు. కొండమల్లెలు. ఆకాలంలో పర్వత పుత్రికలు కర్ణాభరణాలుగా పెట్టుకునేవాళ్ళు," అన్నాడు.

"సాంతాలీలు మన అహీన్ను చాలా మర్యాద చేశారట. తాతగారి పేరుపెట్టి పిలిచారట," అన్నది సునీతి.

రామేశ్వరుడు దీపం వెలుగులో తన కొడుకుమొహం చాలా సేపు చూసి, తృప్తి పడ్డట్టుగా, "ఊఁ !" అన్నాడు.

సునీతి అహీన్ను కిందికి పంపేసి, పూలను ఫ్లవర్‌దాన్‌లో అమర్చి, "చూశారా ? మంచిచీర కట్టుకుని, తల దువ్వుకున్నాను. గీతగోవిందం వినిపిస్తారామరి ?" అని భర్తనడిగింది.

రామేశ్వరుడు మాట వినిపించుకోక ఏదో ఆలోచనలో పడ్డాడు. ఆమె అతని వంటిమీద చెయ్యివేసి, "ఏమిటాలోచిస్తున్నారు ?" అన్నది.

"అహీన్ సాంతాలీలచేత తిరుగుబాటు చేయిస్తాడేమో ?" అన్నాడు రామేశ్వరుడు.

"అహీన్ అలాటివాడు కాదు. బుద్ధిమంతుడు. ఎప్పుడూ వాడు స్కూల్లో ఫస్టునే ఉంటున్నాడు," అన్నది సునీతి.

రామేశ్వరుడు తల అడ్డంగా తిప్పి, "వాళ్ళు రాంగాబాబూ అని పిలుస్తున్నారే !" అన్నాడు.

సునీతికి రాతికేసి తల కొట్టుకోవా లనిపించింది. ఆమె గబగబా కిందికి దిగిపోయి, కబుర్లాడుతున్న మానదానూ, వంటలక్కనూ చూసి, "ఎంత సేపీ కబుర్లు ? ఛీ !" అని వాళ్ళమీద ఎగిరిపడింది.

* * * *

ఇంద్రరాయ్ మర్నాడు తెల్లవారగట్టే లంకకేసి బయలుదేరాడు. కిందటిరాత్రి సాంతాలీలు అహీన్‌కు బ్రహ్మరథం పట్టటమూ, అతన్ని "మా రాంగా బాబు" అనటమూ చూశాక, దీనివెనక జరిగిందేమిటో తెలుసుకోవాలన్న కాంక్ష ఆయనలో తల ఎత్తింది. సాంతాలీలు ఒక రాయిని దేవత అన్నారో, చచ్చినా దాన్ని తిరిగి రాయి అనరు.

ఇంద్రరాయ్ వెంట ముచికుందుడనే అంగరక్షకుడూ, అచింత్య బాబు అనే ఒక అతిథీ ఉన్నారు. ఈ అచింత్యబాబు పోస్టాఫీసు ఉద్యోగిగా ఉంటూ, అనారోగ్యం కారణంగా పనిమానుకుని, ఇన్‌వాలిడ్ పెన్షను పుచ్చుకుని, ఇంద్రుడింట ఉంటున్నాడు. ఆయనకుండే వ్యసనం వ్యాపారాల లెక్కలు. ఏ వ్యాపారం చేస్తే ఎంత లాభం వచ్చేదీ అస్తమానమూ గుణించేవాడు. ఆయనకుగలరోగం అజీర్తి. అచింత్యబాబుకు చావుభయంకూడా జాస్తి. అందుచేత, నదివొడ్డున ఆగిపోయి. లంకనిండా పాములుంటాయనీ, తాను సూర్యోదయం చూస్తూ ఉంటాననీ చెప్పి ఆగిపోయాడు.

ఇంద్రరాయ్ పాదరక్షలు తీసి నదికి అడ్డంనడిచి సాంతాలీ పల్లె చేరాడు. పల్లెలో మగవాళ్ళంతా పనులమీద వెళ్ళారు. వాళ్ళను పిలుచుకురావటానికి వెళ్ళిన ముచికుందుడికి ఆటబొమ్మలు తయారు చెయ్యటంలో సిద్ధహస్తుడైన నిపుణు డొకచోట కనిపించాడు.

"దొరగారు రమ్మంటున్నారు. పద," అన్నాడు ముచికుందుడు.

"పనిమీద ఉన్నాను. మా నాయకుడు కమల్ మాఝీ ఉన్నాడు, పిలు," అన్నాడు ఆటబొమ్మలవాడు. అతను ముచికుందుడికోసం చేతిలో ఉన్న బొమ్మచేత ఆడించి చూపాడు.

సాంతాలీలు వచ్చేలోపుగా ఇంద్రరాయ్ లంకంతా కలయజూశాడు.

అదంతా కలిపి ఏ మూడువందల బిఘాలో ఉంటుంది. అమిత సారవంతమైన నేల. బంగారంపండుతుంది. చక్రవర్తుల జమీలో ఉన్న అఫ్‌జల్‌పూర్‌ను తాకివుండే ఈ లంక చక్రవర్తులదే అవుతుంది. రాధారాణి బిడ్డలు అనుభవించవలసినది, ఆమె సవతిబిడ్డలకు పోతుంది.

కమల్‌మాఝీ వచ్చి వంగి నమస్కారంచేసి ఇంద్రరాయ్ ప్రశ్నలకు వినయంగా సమాధానాలు చెప్పాడు. సాంతాలీలు లంక మీదికి వచ్చి ఆరుమాసాలయింది. వాళ్ళు ఎవరి అనుమతీ పొందలేదు. భూమి ఎవరికీ పట్టనట్టు ఆడవిగా ఉంటే అక్కడ చేరారు

"ఈ లంకమాది. దీనిమీద మీరు ఉండదలిస్తే మాకు కౌలు పత్రాలు రాసి యియ్యాలి," అన్నాడు ఇంద్రరాయ్. కౌలుపత్రాలేమిటో కమల్‌మాఝీకి అర్థంకాలేదు. ఇంద్రరాయ్ వివరించి చెప్పయత్నించాడు. ఈ లోపల సాంతాలీ స్త్రీలు వచ్చి ఒకపక్కగా నుంచుని వారి సంభాషణ ఆలకించసాగారు.

"కౌలుపత్రాలు రాయకపోతే ఇక్కడ ఉండటానికి వీల్లేదు."

మాఝీ తల అడ్డంగా తిప్పి, "మా రాంగాబాబు వెయ్యమంటే వేలిముద్రలు వేస్తాం," అని తేల్చి చెప్పాడు

ఇంద్రరాయ్ ముఖం జేవురించింది. అతను, "హూఁ!" అన్నాడు.

రాయ్‌వంశంలో ఎవరికీ వెయ్యిరూపాయలు మించిన సాలు ఆదాయంలేదు. ఇంద్రరాయ్ ఒక్కడే నాలుగైదువేలు రాబడిగల వాడు. రామేశ్వర చక్రవర్తికూడా నాలుగువేల ఆదాయంగలవాడే. అయితే రామేశ్వరుడు వ్యాధిగ్రస్తుడయాక ఇంద్రుడిది ఏకచ్ఛత్రాధిపత్యం అయింది.

ఆయన ఇంటికి తిరిగివస్తూనే తన కచేరి సావిడి అర్భాటంగా తయారు చేశాడు. గోడలమీద "క్రాస్" చేసి కత్తులూ, డాళ్లూ ఏర్పాటు చేయించాడు. సాంతాలీలను పట్టును రమ్మని తనవస్తాదులను పంపాడు. అపరాహ్ణవేళ వస్తాదుల ప్రోద్బలంతో సాంతాలీ పురుషులందరూ వచ్చి, కచేరీసావిడిచూసి దిగ్భ్రమచెందారు. అది ఇంద్రుడు నిద్రపోయే సమయం గనక వాళ్ళకు అతని దర్శనం చాలా సేపు కాలేదు. వాళ్ళేమో ఇంకా తిళ్ళుతినలేదు.

ఒకగంట గడిచాక ఇంద్రరాయ్ వచ్చాడు, కాని సాంతాలీల సంగతే పట్టించుకోక, ఏదోపనిలో నిమగ్నుడయాడు. ఈ లోపల తమ మగవాళ్ళను వెతుక్కుంటూ సాంతాలీ స్త్రీలుకూడా వచ్చారు. వాళ్ళను భటులు తరిమేశారు.

కమల్‌మాఝీ ఇంద్రరాయ్‌తో, "ఇవాల్టికి మమ్మల్ని పోనియ్యండి. మే మింకా కూడుతినలేదు," అన్నాడు.

"కౌళ్ళమీద వేలిముద్రలు వేసివెళ్ళండి," అన్నాడు ఇంద్రరాయ్.

"రాంగాబాబు," చెప్పందే వెయ్యమని మాఝీ తల అడ్డంగా తిప్పాడు.

అదే సమయంలో అహీన్ అక్కడికి వచ్చాడు. అతనివెనకనే పిలపిలా సాంతాలీ స్త్రీలుకూడా లోపలికి వచ్చారు.

"మామయ్యగారూ, వీళ్ళు స్నానపానాలుకూడా చెయ్యలే దింకా. వీళ్ళ నిలా కూచోపెట్టి ఉంచటంవల్ల ఏంలాభం? పంపెయ్యండి," అన్నాడు అహీన్ ఇంద్రరాయ్‌తో. అతను ఇంద్రుడి సమాధానం కోసం ఆగకుండానే వెళ్ళిపోయాడు.

ఇంద్రరాయ్ హృదయం భగ్గునమండుతున్నది. కాని ఆ మంట పైకిరాలేదు. ఆయన సాంతాలీలని వెళ్ళిపొమ్మన్నాడు.

మదగజంలాటి ఇంద్రరాయ్‌ని రామేశ్వర చక్రవర్తి చిన్న కొడుకు మచ్చిక చేశాడని ఊరంతా పాక్కింది. ఆ వార్తప్రసారం చేసినవాడు ఇంద్రుడి అతిథి అచింత్యబాబే.

ఆ రాత్రే రామేశ్వరుడి పెద్దకొడుకు మహేన్, మేనేజరు మజుందారు గ్రామంలోకి వచ్చారు. మర్నాడు ఉదయం మజుందారు లంకకువెళ్ళి, సంగతులన్నీ తెలుసుకుని, సాంతాలీలను వెంటబెట్టుకుని ఇంద్రరాయ్‌వద్దకు వచ్చాడు.

"మీ చక్రవర్తులు మళ్ళీ సాంతాలీల చేత పితూరీ చేయిస్తారా ఏం?" అని ఇంద్రరాయ్ మజుందారును ఛలోక్తిగా అడిగాడు.

అదెలా సాధ్యమవుతుంది లెండి? ఈ తగాదా రెచ్చగూడదనే అమ్మగారంటున్నారు. పెద్దబాబు మహేన్ చిన్నతనపు ఉద్రేకంలో, లంక ఎవరిదయిందీ. దావా ద్వారా అదే తేలుతుందని అంటే అమ్మగారు ఒప్పలేదు. పెద్దబ్బాయిగారు, సాంతాలీలను తమ వద్దకు మళ్ళీ రాకుండా కట్టుదిట్టం చెయ్యమంటే, చిన్నబ్బాయిగారు ఒప్పలేదు: మామయ్యగారు ఎప్పుడుపిలిస్తే అప్పుడు వెళ్ళటానికి వాళ్ళను ఒప్పించాను.' అన్నారు. వారిఉదయమే స్కూలు తెరుస్తారని వెళ్ళిపోయారు,'' అన్నాడు మజుందారు.

ఇంద్రరాయ్ అహీన్ గురించే ఆలోచిస్తూ ఏమీ మాట్లాడలేదు.

మజుందారే మళ్ళీ, "దస్తావేజులలో ఉండేదేమిటో తమకన్న తెలిసినవారెవరున్నారు? గ్రామచావడ్లో భాగస్తులనందరినీ సమావేశపరిచి ఈ సమస్య పరిష్కారం చేసేస్తే, లంక ఎవరికి చెందేదీ నిర్ణయమవుతుంది. ఆతరవాత ఎవరి శిస్తులు వారు వసూలు చేసుకుంటారు. వీళ్ళను ఇప్పటికి పంపేద్దాం.'' అని సాంతాలీలతో, "మీరంతా ఇప్పటికి ఇళ్ళకు వెళ్ళండి. మేం కూర్చొని శిస్తులు ఎవరెవరికి రావలసిందీ నిర్ణయిస్తాం. అప్పుడు సరయినవాళ్ళకే శిస్తులు చెల్లించవచ్చు,'' అన్నాడు.

సాంతాలీలు వెళ్ళాక ఇంద్రరాయ్ మజుందారుతో, "మిగిలిన భాగస్తుల సంగతి తేలేముందు చక్రవర్తులకూ, రాయ్‌లకూ మధ్య పరిష్కారం కావాలి,'' అన్నాడు.

"అలాగే కానీండి. పత్రాలూ అవీ చూడండి," అన్నాడు మజుందార్.

"పత్రాలుదేనికి, మజుందార్! కర్రలతో తేల్చుకోవచ్చు,'' అన్నాడు ఇంద్రరాయ్.

మజుందారు నిర్ఘాంతపోయి, చేతులు జోడించి, పెద్దలు, విచక్షణగలవారు. ఈ నిప్పును రగులనివ్వకండి,'' అన్నాడు.

"ఈ రావణకాష్ఠం ఆరదు,'' అన్నాడు రాయ్.

మజుందారు వెళ్ళిపోయాక ఇంద్రరాయ్ తన మేనేజరు మైత్రాను పిలిచి, "కౌలుపత్రం రాయించిఉంచు. లంకలో ఇరవై బిఘాల భూమిని ననీపాల్‌కు కౌలుకిద్దామనుకుంటున్నాను,'' అన్నాడు.

ననీపాల్ అడుగంటిన రైతు. కొట్లాటల్లో దిట్ట. రెండుమూడుసార్లు జైలుకుపోయి వచ్చాడు. పైకి చిన్నదుకాణం ఒకటి పెట్టుకుని, చాటున దొంగవ్యాపారం చేస్తూంటాడు. అలాటివాడికి ఇరవై బిఘాల భూమిదొరికితే చక్రవర్తులతో నైనా సరే కొట్లాటలకు దిగగల వాడు.



నసీపాల్ లంకలో కొంతభూమి కౌలుకు తీసుకున్నట్టు త్వరలోనే ఊరంతా పొక్కింది.

*　　*　　*

లంక గురించిన వివరాలు చెవిని పడగానే రామేశ్వరుడి పెద్ద కొడుకు మహేన్, మజుందారును వెంటపెట్టుకుని, తన తల్లిరాసిన ఉత్తరం చేరకమునుపే ఇంటికి వచ్చేశాడు. లంకలో ఒకపక్క సాంతాలీలు వ్యవసాయం చేస్తున్నారు, లంకమీది హక్కుకోసం రైతులు ఎగబడుతున్నారు, రాయ్‌లు దాన్ని వశపరుచుకుని చక్రవర్తులకు కాకుండా చేసే ప్రమాదం ఉన్నది.

అతను కిందటి రాత్రి చాలా పొద్దుపోయి ఇంటికి చేరి తల్లి చెప్పినది విని సంతోషించాడు. సాంతాలీలు తన తమ్ముడంటే చాలా భక్తిగా ఉన్నారు. ఇక భయంలేదు. రికార్డుల్లో లంకను చక్రవర్తుల దయినట్టు నమోదు చేయించటమే తరువాయి.

"దానికి రాంగాఠాకూర్ లంక అని తాతగారి పేరే పెడదాం. మజుందారుబాబూ, రేపొద్దున మన మనుషులను తీసుకుపోయి, రాయ్‌లు పిలిస్తే వెళ్ళవద్దని సాంతాలీలకు చెప్పండి. రాయ్ వంశీయులు గలాటా చేస్తే మనం తగినట్టు బుద్ధి చెబుదాం," అన్నాడు మహేన్.

"వద్దన్నయ్యా. నేను రాయ్ మామయ్యకు మాటఇచ్చాను;" అన్నాడు అహీన్.

"నువు పసివాడివి. నీ కేమీ తెలీదు. ఆ లంక మనది. రాయ్‌లు దాన్ని కాజెయ్యటానికి సాంతాలీలను బెదిరిస్తున్నారు, నేను లేనప్పుడు," అన్నాడు మహేన్.

మజుందారు మధ్యఅడ్డొచ్చి, "అబ్బాయిగా రిచ్చినమాట భంగం కావద్దు. రేపు నేనే సాంతాలీలను వెంటబెట్టుకుని రాయ్‌గారివద్దకు పోతాను. ఆయన ఏం చేస్తారో అదీ చూస్తాం," అన్నాడు.

మహేన్ సమాధానపడ్డాడు. తెల్లారగానే అహీన్‌ను స్కూలుకు పంపెయ్యాలని అతను నిశ్చయించుకున్నాడు. అహీన్ చీకటితోనే బయలుదేరి టవునుకు వెళ్ళిపోయాడు.

మంజుదారు రాయ్ వద్దనుంచి తిరిగివచ్చి, రాయ్‌చేసిన యుద్ధ ప్రకటన తెలిపినప్పుడు మహేన్ మండిపడ్డాడు. తల్లి బోధించే శాంతంలో అతనికి నమ్మకంలేదు. తండ్రిని సంప్రతించుదామంటే ఆయన ఇంచుమించు మతి చెడినట్టు కనబడుతున్నాడు. ఏం చెయ్యాలా అని మహేన్, మజుందార్లు ఆలోచిస్తున్న సమయంలో అక్కడికి సాంతాలీల గుంపు వచ్చింది. ఆడవాళ్లుకూడా ఉన్నారు. వాళ్ళు తాము వేటాడిన రెండు కుందేళ్ళను తమ "రాంగాబాబు" గారికి ఇద్దామని వచ్చారు.

అహీన్ ఆరోజే వెళ్ళిపోయినట్టు తెలిసి వాళ్ళు చాలా ఆశాభంగం పొందారు. మహేన్ అన్నఅనీ, అతనే నిజమైన యజమాని అనీ మజుందారు చెప్పినా వాళ్ళకు సంతృప్తి కలగలేదు.

వాళ్ళు కొట్టితెచ్చిన కుందేళ్ళు చాలా పెద్దవి. లంకమీద అంతేసి కుందేళ్ళున్నట్టు తెలియగానే మహేన్‌కు లంకమీదికి వెళ్ళి వేటాడ బుద్ధిపుట్టింది. అతను కచేరీలోనుంచి తుపాకీ తీసుకుని బయటికి వచ్చి, దుమ్ముదులిపి శుభ్రం చెయ్యసాగాడు.

అంతలో అచింత్యబాబు ఏదోగొణుక్కుంటూ అటుగావచ్చాడు. ఆ పెద్దమనిషి లంకలో ఉన్న మూలికలను ఎగుమతిచేసి లాభసాటి అయిన వ్యాపారం చేద్దామని ఎంతో ఆశపడ్డాడు. ఎన్నో రోజులు శ్రమపడి లెక్కలువేశాడు. కాని ఇంద్రరాయ్ లంకమీద నసీపాల్ లాంటి రాక్షసుడికి చోటు ఇవ్వటంతో అచింత్యబాబు హతాశుడై, తనలో తాను గొణుక్కుంటూ నసీపాల్‌ను తిట్టుకుంటున్నాడు.

మజుందారు ఆయనను పలకరించి, నవ్వుతూ, "ఎవరినో శాపనార్థాలు పెడుతున్నారు?" అన్నాడు.

అచింత్యబాబు సంగతంతా బయట పెట్టేశాడు.

"ఇంద్రరాయ్‌గారు పులితో చెలగాటాలాడుతున్నారు. ఆ నసీపాల్‌గాడొక పెద్దపులి వాడికి లంకలో భూమి రాసిచ్చేస్తున్నారు. మూలికల కోసం నేనక్కడికి అడుగు పెట్టానో నన్ను వాడు హత్యచేసి తీరతాడు. నా ప్లానులన్నీ పాడైపోయాయి," అంటూ అచింత్యబాబు వెళ్ళిపోయాడు.

మహేన్ తుపాకీ కిందపెట్టి మజుందారుతో, "రాయ్‌గారింటి నుంచి ఆ నసీపాల్‌ను లాక్కురమ్మని మనుషులను పంపండి," అన్నాడు.

నసీ వచ్చాడు. మజుందారు అతనితో, "పెద్దవాళ్ళమధ్య తగాదా ఇది. మధ్యలో తలదూర్చటం మంచిదికాదు." అని మంచిగా అన్నాడు.

"ఆస్తి ఎలా వదులుకోను. చెప్పండి? ఆస్తున్నతరవాత తగాదా ఉండనే ఉంటుంది," అన్నాడు నసీపాల్ గోళ్ళు గిల్లుకుంటూ.

ఆస్తి మాది. ఇంద్రరాయ్‌ది కాదు," అన్నాడు మహేన్.

"ఆస్తి మాదేనని రాయ్‌గారూ అంటున్నారు," అన్నాడు నసీ.

"ఆయనమాట అబద్ధం."

"మీ రొక్కరే నిజం చెబుతున్నారన్నమాట!" అన్నాడు నసీ వ్యంగ్యంగా.

"చక్రవర్తులు అబద్ధాలాడేటంత హీనులుకారు," అన్నాడు మహేన్.

"మీ వంశం గొప్ప ఎవరికి తెలీదు లెండి?" అన్నాడు నసీ.

మహేన్ ముఖం జేవురించింది. "ఏమిటీ? ఏమన్నావ్?" అని అతను గర్జించాడు.

"అదేనండీ! మీ సవతితల్లిమాటే! లేచిపోయినామె—"

నసీమాట పూర్తి అయేలోపుగా మహేన్ తుపాకీలో తూటా కూరి, నసీని కాల్చాడు, నసీ చచ్చి పడిపోయాడు.

మహేన్ తుపాకీ కిందపడేసి, పోలీసులకు సరెండరు కావటానికి బయలుదేరాడు. అతను వెళ్ళేముందు తల్లినైనా చూడలేదు.

సునీతి నెత్తిన పిడుగుపడ్డట్టయింది. ఆమె ఏడవాలన్నా భర్త దగ్గిరికిపోయి ఏడవాలిసిందే. ఆమె సాయంకాలందాకా ఆగి, భర్త గదిలోకి వెళ్ళి, దీపం వెలిగించి, కిటికీ తలుపులు తెరిచింది.

రామేశ్వరుడు కొయ్యబొమ్మలా కూర్చుని, పెద్దకళ్ళు చేసుకుని, భయంతో చూస్తూ, "మహేన్‌ని భద్రంగా దాచావా? వాడు ఖూనీ చేశాడు!" అన్నాడు.

"తెలుసు, వాడు దాక్కోలేదు. తానే పోలీసుస్టేషనుకు వెళ్ళాడు," అన్నదామె.

ఆమె తన భర్తను లేచి తిరగమనీ, ఆయన గట్టిగాపూనుకుంటే మహేన్ కొద్ది శిక్షతో తప్పించుకో వచ్చుననీ ఉద్బోధించింది. రామేశ్వరుడిలో చలనం లేదు.

ఆమె వెళ్ళిపోబోతూండగా ఆయన, "మ వ్యాకపని చెయ్యి. రాధారాణిని తలుచుకుని ప్రార్థించు. ఆమె పరువు కాపాడేటందుకే మహేన్ ఈ పని చేశాడు గనక వాణ్ణి కాపాడమను. ఆమె చచ్చిపోయింది," అన్నాడు.

సరేనని సునీతి కిందికిదిగి వచ్చేసరికి మజుందారు ఆమెకోసమే చూస్తున్నాడు.

"మహేన్‌ను చూసివచ్చాను; అతను చాలాధైర్యంగా ఉన్నాడు. అతనిచ్చిన వాఙ్మూలంకూడా చూశాను. నసీ ఏమన్నందుకు తాను వాణ్ణి చంపాడో అదిమాత్రం అతను చెప్పటం లేదు. అవి చెప్పే మాటలైతే వాణ్ణి ఎందుకు కాల్చి చంపుతానని పోలీసు అధికారితో అన్నాడు! నసి అన్నమాటలేవో నేను చెప్పాను." అన్నాడు మజుందారు.

సునీతి, "ఛీ!" అని చీదరించుకున్నది.

"గత్యంతరంలేదు. మహేన్‌ని కాపాడాలిగద! మీరు ధైర్యంగా ఉండండి. మహేన్‌కు ఏమీ ఫరవాలేదు."

మజుందారు ఈ కేసులో లంచాలు పెట్టవలసి ఉంటుందనీ అన్నాడు. తన నగలు అమ్మమని సునీతి అన్నది. లంకభూమి అమ్మితే కొనేవా ళ్ళున్నారని మజుందారు అన్నాడు. అందుకు సునీతి ఒప్పుకోలేదు.

రాయ్‌ని మంచి చేసుకోవటం అవసరమనీ, సునీతి ఒకసారి వారింటికి వెళ్ళిరావటం మంచిదనీ మజుందారు సూచించాడు. అందుకకూడా ఆమె సుముఖురాలు కాలేదు.

ఆ రాత్రి రామేశ్వరుడు తన భార్యతో, "మన రాజవైద్యుణ్ణి ఒకసారి పిలిపిస్తావా? నా వేళ్ళు అతనికి చూపాలి," అన్నాడు.

"ఎందుకూ?" అన్నది సునీతి.

"కుష్ఠు! నాకు కుష్ఠు వచ్చేసింది! నిన్ను పెళ్ళాడక ముందు నుంచికూడా నేనిది వస్తుందని భయపడుతూనే ఉన్నాను," అన్నాడాయన.

సునీతి స్తంభించిపోయింది.

* * *

చక్రవర్తుల ఇంటి కళాకాంతులు బాగా తరిగిపోయాయి. మహేన్ కేసులో అయిదువేలు ఖర్చయింది. మజుందారు అప్పు సృష్టించిపెట్టాడు. సర్కారుకు కట్టవలసిన బాకీలకింద వారు చక్రవర్తుల ఆస్తిని వేలం వేశారు. ఆరోజే మహేన్‌కు ఏడేళ్ళ ద్వీపాంతరవాస శిక్ష పడింది. అంత భారీశిక్ష పడుతుందని ఎవరూ అనుకోలేదు. కాని ప్రాసిక్యూటరు తన వాదంలో, ఈ హత్యకు అసలుకారణం నసీ అన్నమాటలు మాత్రమే కాదనీ, జమీందార్లు ఎప్పుడూ సామాన్య ప్రజలపట్ల రాక్షసుల్లాగే ప్రవర్తిస్తారని గట్టిగా వాదించాడు. ఆ వాదం జడ్జికి నచ్చింది. మహేన్ అపీలు కోరలేదు.

వేలంలో చక్రవర్తుల ఆస్తి చాలాభాగం పోయింది. మజుందారే తన బావమరిదిని అడ్డంపెట్టి తనడబ్బు చక్రవర్తులకు అప్పు ఇచ్చాడని అందరూ అనుకున్నారు. ఆస్తి పోయిన పరిస్థితిలో నౌకర్లనూ, చాకర్లనూ, వంటమనిషినీ పంపేసింది. ఒక్క మానదా అనే పరిచారిక మాత్రం వెళ్ళిపోవ నిరాకరించి, "నాకు జీతం వద్దు, నా కింత కూడుపెట్టండి. నేనెక్కడికీ వెళ్ళను," అనేసింది.

మహేన్ విచారణలో తీర్పు చెప్పిననాడు ఇంద్రరాయ్ కోర్టులో ఉన్నాడు. అక్కడినుంచి ఇంటికి తిరిగివచ్చాక అతను గదిలో నుంచి ఇవతలికి రాలేదు. ఎవరితోనూ మాట్లాడలేదు. బోనులో సింహంలాగా పచార్లు చేశాడు. ఆయన కెంతో ప్రేమపాత్రురాలైన కూతురు ఉమకూడా దగ్గిరికిరాలేదు. "తారా! మాతా!" అని తన ఇష్టదైవాన్ని తలుచుకున్నాడు.

నాలుగోరోజు ఇంద్రుడి భార్య హేమాంగిని భర్తముందుకు వచ్చి, అతని కళ్ళలో నీళ్ళు చూసింది.

"రామేశ్వరుడి పెద్దకొడుకు నా తల నేలకు వంచేశాడు, హేమా. నేను సిగ్గుతోనూ, పశ్చాత్తాపంతోనూ సతమత మవుతున్నాం. చక్రవర్తులను అవమానించటానికి నవీపాల్‌ను ఉసికొల్పాను. ఆవెధవ తీరా అవమానించింది నా చెల్లెల్ని!... నా



చెల్లెలు తనకు సవతితల్లి అని ప్రాసిక్యూటరంటే మహేన్ ఏమన్నాడో తెలుసా ? 'సవతల్లికాదు, పెత్తల్లి ; ఆమెనుగురించి మర్యాదగా మాట్లాడండి,' అన్నాడు. "నువ్వొకసారి నాకు తెలీనట్టుగా మహేన్ తల్లిదగ్గిరికి వెళ్ళిరా, హేమా, నేను జరిగినదానికి ప్రాయశ్చిత్తంచేసుకోవాలి, రామేశ్వరుడి భార్యా బిడ్డల్ని కాపాడాలి," అన్నాడు ఇంద్రరాయ్.

తరవాత అతను మజుందారును పిలిపించి, "నువు చచ్చిపోయాక నీ ఎముకలు రెండుకొని పాచికలు చేయించుకుందామనుకుంటున్నాను, కోప్పడకు. ఆ లంకను నాకు విక్రయించేయించు. లేకపోతే తలఎత్తుకు తిరగలేను.—ఏమిటి నిన్ను తీసేశారా ? రామేశ్వర చక్రవర్తి భార్య పని మానిపించారా ? అయితే ఆమె వ్యవహారజ్ఞురాలే అనాలి; లేకపోతే నువు సొంతం మింగేసేవాడివి. ఈ కాస్తకూడా దక్కకుండా. ఇకముందు నువ్వా లంకకేసి చెయ్యి చాచకు; దానికిప్పుడు రక్షకుణ్ణినేను. ఆసంగతి మరవకు," అన్నాడు.

అదే సమయంలో అహీన్ సైకిల్‌మీద అతి వేగంగా తమ ఇంటికేసి వెళ్ళటం రాయ్‌కంట పడింది. అతనెక్కడినుంచి వస్తున్నాడో కనుక్కొని వస్తానని మజుందారు సెలవు పుచ్చుకున్నాడు.

అహీన్ ఇల్లు చేరుకుని తాను పరీక్షలో పాసయాననీ, పై చదువుకు తనకు స్కాలర్‌షిప్ వస్తుందనీ తల్లికి చెప్పాడు. సునీతి అతన్ని నాన్నగారికి నమస్కారం చేసి రమ్మని పైకి తీసుకుపోయింది. తనకు నమస్కారంచేసిన చిన్నకొడుకుతో రెండు ముక్కలు మాట్లాడి రామేశ్వరుడు అతన్ని పంపేశాడు.

"ఎందుకువాణ్ణి అలా తరిమేశారు ?" అని సునీతి అడిగింది.

"నన్ను తాకాడు. కుష్ఠు !" అన్నాడు రామేశ్వరుడు.

"డాక్టర్లు రక్తపరీక్షచేసి మీకలాటి జబ్బు లేదన్నారు."

"వాళ్ళ కేమీతెలీదు," అన్నాడు రామేశ్వరుడు...

హేమాంగిని వచ్చి, చాలా కాలానికి రామేశ్వరుణ్ణి మళ్ళీ చూసింది. అహీన్ అంతకుముందే వచ్చాడనీ, వాడికి భోజనం పెడతాననీ సునీతి కిందికి దిగిపోయింది.

"మావల్ల చాలా అపచారం జరిగింది. తప్పు వారిదే. ఎన్నాళ్ళనుంచో మిమ్మల్ని చూడాలని ! ఉండబట్టలేక ఇవాళ వచ్చేశాను," అన్నది హేమాంగిని.

"ఇంద్రుడు నిమిత్తమాత్రుడు. చిత్రగుప్తుడి పద్దులు నాకు తెలుసు," అన్నాడు రామేశ్వరుడు.

"ఇక మీరే సారథ్యం వహించాలి, కుంగిపోయి కూచుంటే లాభంలేదు. లేచి నిలబడాలి,"

"ఎలా నిలబడను ? వెలుగు చూడలేను. ఇప్పుడు కుష్ఠుకూడా వచ్చింది."



హేమాంగిని నిర్ఘాంతపోయింది. ఆమె కిందికి దిగివచ్చి, అహీన్‌కు భోజనం పెడుతున్న సునీతిని ప్రేమగా పలకరించి. మజుందారును తీసెయ్యండి, లంకను అమ్మకండి. దానిలో బంగారం పండుతుందిట, ఆ లంకగురించి ఇక మీ అన్నగారు తగూపెట్టరు; సొంతాలీలను పిలిపించి, కవుళ్ళు రాయించుకోండి. ఏవన్నా పేచీలు వస్తే మావారే మీకు సహాయం చేస్తారు. వారికి తెలీకుండా వచ్చాను, ఇక పోతాను," అనిచెప్పి శలవు పుచ్చుకున్నది.

* * * *

లంక భూములు చక్రవర్తులవేననీ, వారికే శిస్తులు చెల్లించి రసీదులు పుచ్చుకోమనీ రాయ్ సొంతాలీలకు కబురుచేశాడు. మధ్యాన్నంవేళ వాళ్ళువచ్చి, తమ "రాంగాబాబు" ఇంట్లో ఉండటంచూసి ఎంతో సంతోషించారు. వాళ్ళు అతనితో చాలా సేపు కబుర్లాడారు, మాఝీ యువతరం సొంతాలీలను గురించి చెబుతూ, "వీళ్ళంతా వెనకటి సొంతాలీలుగారు. అబద్ధాలాడతారు. దగాచేస్తారు, కష్టపడరు; ధర్మాన్ని నిలబెట్టుకోరు. పాపం పెరిగిపోయింది. తిరగబడలేరు," అన్నాడు.

తమ నాయకుడి ఆరోపణకు సొంతాలీలు సిగ్గుపడి తలలు వంచుకున్నారు.



"సీమలుంటేగాని మావాళ్ళకు వ్యవసాయంమీద వేడిపుట్టదు. అదీగాక నా మనుమరాలు సారి పెళ్ళౌతున్నది. అందుకే అందరూ తొందరపడుతున్నారు," అన్నాడు మాఝీ.

ఒకటి రెండు రోజుల్లో వాళ్ళు కోరినట్టు చేయిస్తాననీ అహీన్ మాటిచ్చాడు. మర్నాడు లంకభూములు కొలతలు వేయించటానికి అతను ఏర్పాట్లు చేశాడు.

మర్నాడు ఉదయం రంగ్‌లాల్, నవీన్ మొదలైన రైతులు గుంపుగావచ్చి అహీన్‌ను లంకకు తీసుకుపోయారు. భూమి తమ అధీనంలోకి శాస్త్రోక్తంగా రాబోతున్నదనీ సాంతాలీలు సంబరం చేసుకుంటున్నారు. నాలుగేసి బారల నిడివిగల వెదురు కర్రలతో కొలతలు పూర్తి అయాయి.

ఒక్కొక్క సాంతాలీ పేరూ, వాడికి కావలసినభూమీ చెప్పమంటే కమల్‌మాఝీ నిరాకరించాడు.

"ఎవరెంత శిస్తుకట్టాలో, ఎవరిభూమి ఎంతో ఎలా తెలుస్తుంది?" అన్నాడు అహీన్. మొత్తంభూమికి శిస్తెంతో చెబితే మిగిలిన విషయాలు తమలో తాము తేల్చుకుంటామన్నాడు మాఝీ: ఆట బొమ్మలవాడు తమభాషలో ఎవరివంతు వాళ్ళపేరనే వేయించుకుందామనేసరికి మాఝీ ఉగ్రుడైపోయి వాడిచెంప పగలగొట్టాడు. నలభై బిఘాల చిల్లరఉన్నభూమి అంతా కమల్‌మాఝీ పేరనే శిస్తు రాయటం జరిగింది.

తరవాత ఇంకో తగాదా ఆరంభమయింది. సాంతాలీలు ఆక్రమించిన ప్రదేశానికి ఆనుకుని యాభై బిఘాలభూమి సాగులేకుండా అడవిగా పడిఉంది. దాన్ని రైతులు కొలవటానికి యత్నిస్తే మాఝీ అడ్డుపడి, "దాన్ని మీకివ్వను. ఇస్తే మా పిల్లాజల్లా గతేమిటి?" అని నవీన్ చేతిలోని కొలతకర్ర లాగేశాడు.

రంగ్‌లాల్ రెచ్చిపోయాడు. మాఝీ అంతకన్న రెచ్చిపోయాడు.

అహీన్ ఇద్దరిమీదా అరుస్తూ, "ఇది మీకురాదు, సాంతాలీలకూ రాదు, మాసొంత వ్యవసాయంకింద ఉంటుంది," అన్నాడు.

రైతులు మరొకపక్కన భూమి కొలుచుకున్నారు. ఎవరి భూములకు వాళ్ళు ఎల్లలకింద మట్టిపోగులు పెట్టుకున్నారు.

ఆ సాయంకాలమే సాంతాలీలు వచ్చి తాము చెల్లించవలసిన శిస్తునైనం అణా పైసలతోసహా చెల్లించిపోయారు. రంగ్‌లాల్, నవీన్ మొదలైన రైతులుకూడా తమ శిస్తుసొమ్ము తీసుకోమని అహీన్ దగ్గిరికివచ్చారు. వాళ్ళు అయిదుమంది.

రైతులు భూస్వామిదగ్గిర భూమి కవులుకు తీసుకునేటప్పుడు బిఘాకు అయిదురూపాయల చొప్పున కానుకగా చెల్లించటం రివాజు. సాంతాలీలు ఉత్తశిస్తుమాత్రమే చెల్లించారు. తాముకూడా అలాగే చేస్తామని రంగ్‌లాల్ పేచీపెట్టాడు. సాంతాలీలు చేసినట్టే తాము కూడా చెయ్యటం పరువుతక్కువ అనీ, కానుక చెల్లించాలిసిందేననీ నవీన్ అన్నాడు. రైతులు ఇరవై బిఘాలు తీసుకుంటున్నారు. నూరురూపాయల కానుకవదులుకోవటం అహీన్‌కు ఏమీ ఇష్టం లేదు. అసలే డబ్బు ఇబ్బంది జాస్తిగా ఉన్నది.

నవీన్ ఆ మాట అన్నమీదట, "సరే పోనీ కానుక లిచ్చుకుందాం. కానుకలకింద నూరురూపాయలు, శిస్తుపైకం అయిదయిదులు ఇరవై అయిదూ! పుచ్చుకోండి బాబూ, దోసెడు రూపాయలు!" అని రైతు లన్నమీదట, వాళ్ళేదో దొంగయెత్తు మీద వచ్చారని శంకించి. అహీన్ నిరాకరించాడు.

"ఇప్పుడు కాలుపట్టా లివ్వటం కుదరదు. నాన్నగార్ని సంప్రతించాలి," అన్నాడు అహీన్.

"సరే అయితే శిస్తు తరవాతే తీసుకోండి. ముందు మేం పొలం సగము ప్రారంభిస్తాం," అన్నారు రైతులు, భూమిని స్వాధీనం చేసుకోవాలన్న తమ తీర్మానాన్ని స్పష్టంచేస్తూ. అహీన్‌కు చాలా ఆగ్రహం వచ్చింది, కాని దాన్ని అణచిపెట్టుకుని తలనొప్పి తెచ్చుకుని, కూర్చున్నచోటనే పడుకుని నిద్రపోయాడు.

దీపాలు పెట్టేవేళ తల్లివచ్చి నుదుటిమీద చెయ్యివేసేసరికి అతను నిద్రలేచాడు. ఇల్లంతా నిర్జీవంగా బావురుమంటున్నది. తల్లి నిద్రపోతున్నావేమంటే మనసులో ఏదోగా ఉన్న దన్నాడు.

"మంచివెన్నెల. చల్లగాలికి అలాతిరిగిరా, నాయనా?" అన్నది సునీతి.

తల్లి చెప్పినట్టే జరిగింది. అతను నదీతీరానికి వచ్చాక చాలా వరకు తేరుకున్నాడు.

నది అవతల లంకలో సాంతాలీలు సంబరం చేసుకుంటున్నారు. మద్దెళ్ళు మోగుతున్నాయి, పాటలు వినిస్తున్నాయి. జమీందార్లకు సొమ్ము చెల్లించినందుకు వాళ్ళు తమదేవతకు కోళ్ళనూ, మేకలనూ బలియిచ్చి కొలుపులు చేస్తున్నారు. చిత్తుగాతాగి ఆడుతున్నారు, పాడుతున్నారు.



ఆ సమయంలో అతనికి దగ్గరలో సాంతాలీ సంభాషణ వినపడింది ఆ మాట్లాడుతున్నవాళ్ళు మార్ఝి మనమరాలూ, భార్యా. అహీన్ ముసలిదానిద్వారా విషయం తెలుసుకున్నాడు.

మార్ఝి చిన్నవాళ్ళకు భూమి కేటాయించలేదట. మార్ఝి మనమరాలు సారి పోట్లాడి పారిపోతున్నది. పెళ్ళికాగానే వేరేకాపరం పెడుతుందట. విడిగా భూమి కావాలిట. "మా కొ్కంపా గోడీ అక్కర్లేదా? మాకు పిల్లాజెల్లా పుట్టరా?'' అని సారి అడిగింది. ఇంకా పెళ్ళి కాకుండానే దానికి సంసార తాపత్రయం!

అహీన్‌కు మార్ఝి చేసినపని నచ్చలేదుగాని, అందులో అర్థం ఉంది. కష్టపడి పనిచేసే వయసులో ఉన్నవాళ్ళు వొళ్లొంచి పని చేస్తే నాలుగుడబ్బులు సంపాదించుకుని, దాంతో భూమి కొనుక్కుంటారు. ముసలాళ్ళు చచ్చాక వాళ్ళభూమి వీళ్ళకెట్లాగూ వస్తుంది, జనాభాతోపాటు భూమికూడా పెరగాలిమరి.

కుర్రకారువాళ్ళు తన వద్దకు వస్తే తమ సొంతభూమిలోనుంచి వాళ్ళకిస్తానని అహీన్ మాటిచ్చాడు.

సారి ఆనందానికి అంతులేదు.

* * *

రైతులకు లంక భూముల విషయం ఆలోచించే ఉసులు చిక్కలేదు. తొలకరి జల్లుపడగానే వాళ్ల నాగళ్ళు కట్టుకుని తమ పొలాలకు వెళ్ళారు. నారుమళ్ళు పొయ్యాలి ముందు. వాటిని గొడ్ల నుంచి కాపాడుకోవాలి.

ఆషాఢం మధ్యలో గట్టివానలు పడ్డాక వాళ్ళకు లంకభూములను గురించి ఆలోచించే వీలుదొరికింది. నవీన్, రంగ్‌లాల్ దగ్గిరికి వచ్చి ఆ సంగతే మాట్లాడాడు. ముందు లంకభూమిలో దుబ్బులూ అవీ దున్నెయ్యాలి. కాని జమీందార్ల పక్షంనుంచి తగాదావస్తే? కవుళ్ళింకా ఏర్పాటు కాలేదుగా!

"ముసలాయనకు మహావ్యాధిట. పెద్దబ్బాయి జైల్లో ఉన్నాడు. చిన్నాయన చదువుకోబోయాడు. జమీందారు భార్య ఏం తగూ తెస్తుంది?'' అన్నాడు రంగ్‌లాల్.

ఆవిడ చేతిలోనే సాంతాలీలంతా ఉన్నారనీ, చిన్నబ్బాయి వాళ్ళ కుర్రకారును తమసొంతభూమి ఇచ్చి మంచిచేసుకున్నాడనీ నవీన్ జ్ఞాపకం చేశాడు. అతను ఒకప్పుడు దివాణం నౌకరు. జమీందార్ల లోగిలంటే కొంత ఆదరాభిమానాలు గలవాడు. జమీందారు భార్యతోనే మాట్లాడి పేచీలేకుండా చేసుకుందామన్నాడు.

అందుకు రంగ్‌లాల్ ఒప్పలేదు. లంకమీదికి నాగళ్ళను తీసుకు పోదామనీ, ఎవరన్నా నాగళ్ళు లాగేస్తే, మేస్ట్రీటుకు అర్జీపెడదామనీ అన్నాడు.

అది నవీన్‌కు నచ్చలేదు.

ఇద్దరికీ రాజీగా, ముందు లంకలో పరిస్థితులు చూసిరావటానికి ఇద్దరూ బయలుదేరారు. వాళ్ళు ముందుగా సాంతాలీలు వెనకనుంచీ చేస్తున్న పొలాలు చూసి ఎంతో ముచ్చటపడ్డారు. అవి ఇరవై యేళ్ళుగా సాగుచేస్తున్న పొలాల్లాగున్నాయి. పైర్లు బలంగా, దిష్టితగిలేటట్టున్నాయి.

తరవాత వాళ్ళు, సాంతాలీ యువకులకు అహీన్ ఇచ్చిన భూమి దగ్గిరికి వచ్చారు. కుర్రకారువాళ్లు అందులో కొంతమేర దుబ్బులు తొలగించి, పైర్లుకూడా వేశారు. మిగిలినప్రాంతం బాగుచేసుకుంటున్నారు.

అక్కడినుంచి వాళ్ళు తాము తీసుకుందామనుకున్న ప్రాంతానికి వచ్చేసరికి ఆ ఇద్దరు రైతులకూ గుండె జారిపోయింది. ఆ ప్రాంతమంతా కీకారణ్యంలాగా ఉంది. వానలకు రెల్లు, వట్టిపొదలు రామ్మెత్తు పెరగటమేగాక మధ్యమధ్య ఏవేవో మొక్కలు దట్టంగా పెరిగాయి. ఆ భూమిలో నాగలి మోపటానికిలేదు. అదంతా బాగుచెయ్యందే వ్యవసాయం అసాధ్యం.

నవీన్‌కు ఒక గొప్ప ఆలోచన తట్టింది. ఈ యేటికి ఈ భూమిని సాంతాలీల కిచ్చి, వాళ్ళు దాన్ని వ్యవసాయానికి లాయకు చేశాక, వచ్చే ఏటినుంచి తామే చేసుకుంటే?

సాంతాలీలను అడిగి చూద్దామన్నాడు రంగ్‌లాల్.

వాళ్ళు మారీ ఇంటికి వెళ్ళేసరికి అక్కడ శ్రీవాస్ పాల్ ఉన్నాడు. అప్పటికే అతను, రైతులు తీసుకుందామనుకున్న లంకభూమిని తాను తీసుకుని, డబ్బుకూడా కట్టేశాడు. అతను ఆ ప్రాంతంలో ఒకదుకాణం పెట్టాడు. సాంతాలీలు అతన్ని తిండికి ధాన్యం అప్పివ్వమంటున్నారు. అతను వాళ్ళను తనభూమిని వాళ్ల సాగుచెయ్యాలంటున్నాడు.

"అదంతా కుదురదు. మే మా భూమి అంతా బాగుచేసినాక తిరిగి మీరు లాగేసుకుంటారు. మాకు కూలి ఇవ్వండి, భూమిని బాగుచేసి పెడతాం,'' అన్నాడు మారీ.

రంగ్‌లాల్, నవీన్ ఇది విని కొయ్యబారిపోయారు. రంగ్‌లాల్, శ్రీవాస్ కొత్తగాపెట్టిన దుకాణానికి వెళ్ళి శ్రీవాస్ ఇంటికి వెళ్ళిపోయాడని తెలిసిఊళ్ళోకి వచ్చి, శ్రీవాస్ ఇల్లుచేరాడు. అతను శ్రీవాస్‌నుచూస్తూనే, "ఏమిటి మీఉద్దేశం?'' అని రోషంగా అడిగాడు.

"మీరు చిన్నబాబుగారితో ఆ భూమిగురించి మాట్లాడకముందే నేను పెద్దబాబుగారిచేత ఆ భూమి ఖరారుచేయించుకున్నాను. నవీ హత్య జరిగిననాడే ఆ ఏర్పాటు జరిగింది. కావలిస్తే రసీదూ, పట్టా చూసుకోవచ్చు. దానిమీద మజుందారుగారి సాక్షిసంతకం కూడా ఉంది," అంటూ శ్రీవాస్ రసీదుతీసి చూపాడు.

"ఇది దొంగపట్టా. మజుందారు మీతో లాలూచీ అయి సృష్టించినది. మే మా భూమిని వదలం, ముందే చెబుతున్నా,'' అన్నాడు రంగ్‌లాల్.

శ్రీవాస్ నవ్వి, "రేపు మా మనుషులు ఆ భూమి బాగు చెయ్యటానికి వస్తారు. చాతనయితే వాళ్ళను ఆ భూమిలో అడుగు పెట్టకుండా చెయ్యండి,'' అన్నాడు. తనదగ్గిర ధాన్యం అరువు తీసుకోవటానికి వచ్చిన ముసల్మానుల గుంపుతో అతను, "విన్నారుగా - మీ రంతా రేపు పెందలాడే రండి. నేను మీ మీదే ఆధారపడి ఉన్నాను,'' అన్నాడు.

రంగ్‌లాల్ వెంటే ఇంతసేపూ తిరిగిన నవీన్, "నీ వ్యవహారంలో నేనుండను," అన్నాడు. అసలే రంగ్‌లాల్ దహించుకుపోతున్నాడు. బంగారంలాటి భూమిమీద రైతుకు మమత ఉండటం సహజం. దానికి మజుందారూ. శ్రీవాసూ అడ్డం తగిలారు. నవీన్ కూడా జారుకుంటున్నాడు.

"పో వెధవా! నేను ముందే అనుకున్నాను,'' అన్నాడు రంగ్‌లాల్.

నవీన్‌కు రోషం వచ్చింది. అతను బాగ్దీలనే నిమ్నజాతికి చెందినవాడు బాగ్దీలు కొట్లాటలకు ఘటికులు.

"నేనే కాదు. మా బాగ్దీలందర్నీ రేపు కొట్టుకొస్తాను, లంకలో కలుసుకుందాం," అంటూ నవీన్ వెళ్ళిపోసాగాడు.

"ఏమిటా పోవటం? అటెక్కడికి పోతున్నావ్?" అని రంగ్‌లాల్ కేకేసి అడిగాడు.

"మా యజమాని ఇంటికి. వారిఉప్పు చాలా తిన్నాను. వారి అనుమతి తీసుకుంటా, రేపు ఆ భూమిమీదికి మీరుగాని, శ్రీవాస్ పంపే మనుషులుగాని ఎట్లా అడుగుపెడతారో చూస్తా," అన్నాడు నవీన్.

రంగ్‌లాల్ కొంచెం ఆలోచించి, "పద...భూమిని మనకే రాయించుకుందాం," అన్నాడు. ఈమాటతో నవీన్ తృప్తి పడ్డాడు.

నవీన్ ఒకప్పుడు దివాణం నౌకరుగనక తిన్నగా సునీతి ఉన్నదగ్గిరికి వెళ్ళిపోయాడు. రంగ్‌లాల్ మాత్రం బయటనే ఉండిపోయాడు. నవీన్ సునీతితో సంగతి సందర్భాలన్నీ చెప్పి, రైతులూ, శ్రీవాసూ, మజుందారు కూడా చక్రవర్తులను మోసగించటానికి చేస్తున్న కుట్రలన్నీ బయటపెట్టాడు.

కుట్ర తలపెట్టిన రైతుల్లో నవీన్‌కూడా ఉన్నాడు గనక, మానదా అతనితో, "బాగ్దీకాడా. ఇంత తాడుతెచ్చి ఉరిపెట్టుకోకపోయావా?" అన్నది.

సునీతి మానదాకు అడ్డంవచ్చి, "కొంత తప్పు అహీన్‌వల్ల కూడా ఉన్నది. సాంతాలీల కిచ్చినట్టే, నవీనుకు కూడా కానుకలడగకుండా భూమియిచ్చి ఉండవలసింది _ సాంతాలీల కన్న పరాయివాడా?" అన్నది.

ఆమాటకు నవీన్ భోరున ఏడ్చాడు. సునీతి అతన్ని ఓదార్చుతూ, "కాని నాచేతిలో ఏమీలేదు, నవీన్. విస్సహాయురాలిని," అన్నది.

"మీరు అనుమతివ్వండమ్మా, మా బాగ్దీలందరూ లాఠీలతో వెళ్ళి నిలబడి ఆ భూమిలోకి ఎవడూ అడుగుపెట్టకుండా చూస్తారు," అన్నాడు నవీన్.

"రెండొందల యాభై రొక్కంతెచ్చా, నవీన్, భూమి మనకు కౌలుకిప్పించమని అమ్మగార్నడుగు," అని బయటినుంచి రంగ్‌లాల్ కేకపెట్టాడు.

"ఆపని చెయ్యండమ్మా, గలాటవస్తే మేం చూసుకుంటాం," అన్నాడు నవీన్.

సునీతి ఈ రైతులను చూసి జాలిపడింది. వాళ్ళది స్వార్థం కానేకాదు, అది తమదే.

"నేనుకూడా శిస్తు కట్టుకుంటాను, నాక్కూడా ఓ అయిదు బిఘాలభూమి ఇప్పించండమ్మా! నేను ఈ బాగ్దీవాడి కన్న పరాయిదాన్నా?" అన్నది మనదా వెటకారంగా.

నవీన్‌కు ఓర్పుపోయింది; బయట రంగ్‌లాల్ పళ్లు కొరికాడు

అదే సమయానికి మజుందారు వచ్చాడు, "అమ్మగారున్నారా?" అని అతివినయంగా అడుగుతూ. ఆయన లోపలికి వస్తూనే తన పూర్వపు యజమాని ఆరోగ్యం గురించి శ్రద్ధాసక్తులు కనబరిచాడు.

"మేనేజరుగారి కెలా అయినా పాత యజమాని మీదనే పంచప్రాణాలు!" అని మనదా ఎత్తిపొడిచింది.

మజుందారు ముఖం జేవురించింది. ఆయన అసలు విషయానికి వచ్చి, "మహేన్ బాబుగారు శ్రీవాస్‌కు నూరు బిఘాలభూమి యిచ్చి, ఆరువందలు పుచ్చుకున్నారు. పట్టా నేనే రాశాను... ఈ సంగతి మీకుతెలిసే అవకాశం ఏదీ? అంతలోనే నవీ హత్యజరిగిపోయె... ఇప్పుడా భూమిలో యాభై బిఘాలు వాళ్లు ఆక్రమించుకుందామని చూస్తున్నారు. జబర్దస్తీగా!" అన్నాడు.

"అదేంకాదు. వాళ్ళకు భూమి ఇస్తానని నేనే చెప్పాను." అన్నది సునీతి.

"దానికేం? లంకలో ఇంకా చాలాభూమి ఉంది." అన్నాడు మజుందారు.

మానదాకు మండిపోయి, "అబ్బాయిగారి చేతిలోంచి గద్ద తన్నుకు పోయింది ఆ ఆరొందలేనేమో!" అన్నది.

మజుందారు నవ్వి. "ఆడబ్బు మహేన్‌బాబు నాకే ఇచ్చారు. కేసుకింద ఖర్చయింది. అది ఖాతా పుస్తకాల్లోకి ఎక్కిందికూడా.

అందాకా బయటఉన్న శ్రీవాస్, "శిస్తుడబ్బు వందా తెచ్చాను, మజుందారు గారూ," అంటూ లోపలికి ఏకంగా వచ్చేశాడు.

సునీతికి తల చితకగొట్టినట్టయింది. డబ్బు ఇచ్చేవాడి ధీమాతో ఎవరుగాని అనుమతి లేకుండా అలా లోపలికి అడుగుపెట్టటం జరుగుతుందని ఆమె కలలోకూడా అనుకోలేదు. ఆమె చప్పున అక్కడినుంచి వెళ్ళిపోయి భర్తవద్దకు చేరింది.

మజుందారు వెర్రిమొహంవేసి, "అమ్మగారు వెళ్ళిపోయారే!" అన్నాడు.

"నేనున్నాగా? చెప్పండి; అంతఃపురం కచేరీ సావడి అయిందిగా?" అన్నది మనదా.

సునీతి మానదాను కేకేసి, "మజుందారు గారిని ఒక్కరోజు ఆగమని చెప్పు. రేపు రాయ్ అన్నగారే ఏం చెయ్యాలో చూస్తారు." అన్నది.

"ఆగటానికేమీలేదు. కాని అందువల్ల రక్తపాతం జరగవచ్చు. ఆమాట అమ్మగారితో చెప్పు," అన్నాడు శ్రీవాస్ మానదాతో.

"శ్రీవాస్‌తో మీరొక్కమాట మాట్లాడండి," అని సునీతి తన భర్తను బతిమాలింది.

"వద్దు," అన్నాడు రామేశ్వరుడు.

మర్నాడు ఉదయం సునీతి కిటికీలోంచి లంకకేసి చూసి, అక్కడ ఏదో గలాటా సాగుతున్నట్టు తెలుసుకొని; ఏమిటో చూసి రమ్మని మానదాను పంపింది. మానదా వెళ్ళింది. లంకకేసి జనం పరిగెడుతున్నారు

నవీన్ ఒక ముసల్మానుబుర్ర పగలగొట్టాడని మానదాకు ఎవరో చెప్పారు. "ఖూనీ, ఖూనీ!" అన్న మాటలు వినిపించాయి.

* * * *

కొట్లాట గురించి కేసువిచారణ జరిగింది. మజుందారు తెలివితేటల మూలంగా శ్రీవాస్ నిర్దోషిగా తేలాడు. రంగ్‌లాల్ నవీన్‌కు విరుద్ధంగా కోర్టులో సాక్ష్యం ఇచ్చి, నవీన్‌నుకాపాడమని దేవుడికి దణ్ణాలు పెట్టుకుంటూ ఇంట్లో కూర్చుని భోరున ఏడ్చాడు. నవీన్ గురించి సునీతికూడా ఎంతో దుఃఖించింది. నవీన్ కుటుంబం వాళ్లు మూడు తరాలుగా చక్రవర్తుల నౌకరీచేశారు. నవీన్‌పోతే ఇక ఈ ఇంటికి రక్షణలేనట్టే.

సెషన్సు విచారణలో సాక్ష్యం చెప్పమని సునీతికి సమను వచ్చింది. సమను తెచ్చినవాడి వెంట మజుందారూ, శ్రీవాసూ వచ్చి బయట ఉండటం మానదా కంటపడింది.

తానుపోయి కోర్టులో – అంతమంది ఎదట నిలబడి – సాక్ష్యం ఇవ్వటమంటే సునీతికి, అంతకంటె చావు మేలనిపించింది. అసహాయుడైన భర్తకు ఆఖరు క్షణందాకా సేవచెయ్యాలనే ఉద్దేశంతో ఆమె విధవగానే మరణించగోరటంచేత ప్రాణంతీసుకునే అవకాశం కూడా లేకుండాపోయింది. ఈపనిచేసింది మజుందారూ, శ్రీవాసూ అని మానదాచెబితే, మనుషులు ఎంత నీచానికి ఒడిగట్టగలరో ఆమె తెలుసుకుని ఆశ్చర్యపడింది.

సునీతిని చూడటానికి హేమాంగిని, తన పన్నెండేళ్ళ కూతురు ఉమతో సహావచ్చింది. తనను తనభర్తే పంపినట్టు హేమాంగిని సునీతితో అన్నది. మజుందారు కుట్రవల్ల సునీతిని సాక్షిగా వేశారని ఇంద్రరాయ్‌కి తెలిసింది. కోర్టులో సాక్ష్యం చెప్పటానికి బిడియపడ నవసరంలేదని చెప్పమని అతను తన భార్యను పంపాడు.

ఈసంగతి తనభర్తకు తెలిస్తే ఆయనగతి ఏమవుతుందోనని సునీతి భయపడింది,

"వ్రతం పట్టాననీ, గంగాస్నానం చేసివస్తాననీ చెప్పు. నువు వచ్చేదాకా నేనాయన్ను కనిపెట్టిఉంటాను." అన్నది హేమాంగిని.

ఉత్తరంరాసి అహీన్‌ను పిలిపిస్తే, రాత్రివేళ అతను తండ్రిని కనిపెట్టి ఉంటాడు. పగలు తనువస్తుంది. సునీతివెంట తన కొడుకు అమల్‌వస్తాడు. ఇలా హేమాంగిని ఏర్పాటుచేసింది.

కింద పెద్దవాళ్ళు మాట్లాడుకుంటూంటే ఉమ పైకి, రామేశ్వరుడి వద్దకుపోయి, స్నేహం చేసుకుని, రవీంద్ర గీతాలుపాడి వినిపించింది.

కాలేజీకి సెలవుపెట్టి అహీన్ వచ్చాడు, తల్లి కోర్టులో సాక్ష్యం ఇవ్వటానికి బిడియపడ నవసరంలేదని అతనుకూడా అన్నాడు. అమల్ వచ్చాడు. అతనికి, అహీన్‌కీ ఇదే పరిచయం. చిన్నప్పుడెప్పుడో కలిసి చదువుకున్నారు. ఉభయ కుటుంబాలమధ్య రేగిన వైషమ్యాలవల్ల వాళ్ళు దూరమయారు. మర్నాడే సునీతిని వెంట తీసుకుని కలకత్తాబయలుదేరుతున్నట్టు చెప్పటానికి అమల్‌వచ్చాడు.



సునీతి బోనులో నిలబడి గజగజా వణికిపోయింది. అనుల్ పక్కన నిలబడి ధైర్యంచెప్పాడు. ఆమెసాక్ష్యం కొద్దిలోనే తేలిపోయింది. ఆమె ఇవతలికివచ్చి ఇంద్రరాయ్ కాళ్ళంటి ప్రణామం చేసింది. ఇంద్రరాయ్ ఆమెకోసం బండి సిద్ధంగాఉంచాడు. అందులో ఆమె అమల్ వెంట ఇంటికి తిరిగివచ్చింది.

ఈ లోపల హేమాంగిని రామేశ్వరుడితో అనుకున్న ప్రకారమే అబద్ధంచెప్పింది. తనభార్య వ్రతంబట్టి గంగాస్నానం చేయబోయిందనే ఆయన అనుకున్నాడు. కాని అమాయకురాలైన ఉమ, రోజూవచ్చి రవీంద్రకవిత చదివి వినిపించినట్టే వినిపిస్తూ, నిజం బయటపెట్టేసింది.

తనభార్య-సెషన్స్‌కోర్టులో సాక్ష్యం యివ్వబోయిందని తెలియగానే రామేశ్వరుడు వివశుడై పడిపోయాడు. ఉమ కంగారుపడి తల్లిని కేకేసింది. రామేశ్వరుడు ఒళ్ళుతెలిసి, "నాతో అబద్ధం చెప్పారా? మజుందారు సునీతిని బోను ఎక్కించాడా?" అని అడిగాడు. ఆయన అహీన్‌ను తుపాకీ తీసుకురమ్మన్నాడు. అహీన్ తుపాకీ లేదన్నాడు. మహీన్‌పేరు ఎత్తగానే రామేశ్వరుడు గ్రహించాడు. ఉడుకులాంతో శైత్యోపచారాలుచేసి హేమాంగిని ఆయనను నిద్రపుచ్చింది. ఆయన నిద్రలేచేలోపల సునీతి తిరిగి వచ్చేసింది.

రామేశ్వరుడు సునీతిని చూడగానే, "నువు రాధారాణివా? సునీతివా?" అని అడిగి, "నువు సునీతివే రాధారాణికి ఏడవటం తెలీదు. చూడూ, జడ్డీగారు నన్నుగురించి అడిగారా?" నన్ను పట్టుకుపోతారా? అన్నాడు. సునీతి జవాబు చెప్పలేదు.

*   •   *

విచారణ ఇంకా ఎనిమిది నెలలపాటు సాగి, చివరకు నవీన్‌కు ఆరుసంవత్సరాల శిక్ష, అతని అనుచరులిద్దరికి రెండేళ్ళుపడ్డాయి. నవీన్‌కోసం ఏడ్చిన పైవాళ్ళు ఇద్దరే — రంగ్‌లాల్, సునీతి. శ్రీవాస్ మజుందార్లు వేడుక చేసుకుని సర్వరక్షాదేవి పూజకు బాజా భజంత్రీలతో బయలుదేరారు. వాళ్ళు తన ఇంటిముందుగా పోతుంటే ఇంద్రరాయ్‌చూసి, "లంకకు బలిజరిగింది. సర్వరక్షాదేవికో?" అన్నాడు. ఆమాటవింటూనే, వాళ్ళవెంట దీపాలు తీసుకొచ్చినవాళ్ళు జారుకున్నారు.

నవీనుడిపెళ్ళాం తన మనమణ్ణి చంకనేసుకొచ్చి, తనను పనిలో పెట్టుకోమని సునీతిని కోరింది. తన మొగుడిమీద కేసులో అపీలు చెయ్యమంటున్నారనీ, అందుకు ఖర్చవుతుందనీ అన్నది.

సునీతి తనకు సాధ్యమైనంతలో డబ్బు సహాయం చేద్దామనే అనుకున్నది. ఆమె అహీన్‌ను ఇంద్రరాయ్‌దగ్గిరికి పంపింది. ఇంద్రరాయ్ అపీలుకింద చాలా డబ్బవుతుందనీ, నవీన్‌లాటివాడికి అయిదారేళ్ళ జైలులక్ష్యం ఉండదనీ అన్నాడు.

తరవాత కొద్దిరోజులకే అమల్ తన గ్రామానికి. తిరిగివచ్చి, అహీన్ నాలుగో రాంకులో వచ్చినట్టు శుభవార్త చెప్పాడు.

*   •   •

లంకమీద కొట్లాటజరిగి మూడేళ్ళయింది. వర్షాకాలం. వర్షాలప్పుడు సాంతాలీలకు కూలిసంపాదన ఉండదు. వాళ్ల ధాన్యం కోసం శ్రీవాసుదగ్గిరికి వచ్చారు. శ్రీవాస్ వాళ్ళకు ధాన్యం వడ్డీకి అప్పిస్తూంటాడు, పంటరాగానే వాళ్ల అసలూ, వడ్డీకూడా ధాన్యం రూపంలోనే తీరుస్తూఉంటారు.

రంగ్‌లాల్, నవీన్ మొదలైనవాళ్ళతో తగాదాపడి కొట్లాడటం శ్రీవాస్‌కు ఏమంత లాభించలేదు. నూరు బిఘాలభూమి వచ్చింది. కాని కేసు ఖర్చులకింద చాలా వ్యయమయింది. శ్రీవాస్ సాంతాలీల భూమి కాజెయ్యడానికి పథకంవేశాడు. ధాన్యంకోసం వచ్చిన వాళ్ళని, పాతబాకీలమీద వేలిముద్రలువేసి మళ్ళా ధాన్యం పట్టుకుపొమ్మన్నాడు.

ఎప్పటికప్పుడు ధాన్యంబాకీలు తీర్చేస్తుంటే పాతబాకీలు ఎందుకు మిగిలాయో వాళ్ళకు అర్థంకాలేదు. శ్రీవాస్ లెక్కలుచెప్పాడు. అందరూవచ్చి వేలిముద్రలువేస్తే తనదగ్గిర ధాన్యం సిద్ధంగానే ఉందన్నాడు.

ఆ సాయంకాలం ఇంద్రరాయ్‌ని చూడటానికి కలకత్తానుంచి ఒక పెద్దమనిషివచ్చాడు. ఆయన ఈ ప్రాంతంలో ఒక పంచదార మిల్లు పెట్టాలనే ఉద్దేశంతో లంకభూమి చూడాలనుకున్నాడు. ఆయన వెళ్ళి చూసేసరికి లంకలోమూడోవంతు ఇంకా వరదనీటికిందే ఉంది. ఆయనపేరు విమలబాబు. ఇంద్రరాయ్ తన మేనేజరైన మైత్రాను విమలబాబువెంట లంక చూడటానికి పంపాడు.

విమలబాబు వ్యాపారస్థుడు, ఆయనకింద కొన్ని మిల్లులున్నాయి. చదువుకున్నవాడు. శాస్త్ర పరిజ్ఞానం కలవాడు.

మైత్రా విమలబాబును సాంతాలీపల్లెకు తీసుకువచ్చేటప్పుడు వాళ్ళ శ్రీవాస్ దుకాణం దగ్గిరికిరాగానే అక్కడ అనేకమంది మాఝీలు కనబడ్డారు. వాళ్ళ ఖాతాపుస్తకాలలో వేలిముద్రలు వేస్తున్నారు.

శ్రీవాస్ లేచివచ్చి మైత్రాకు నమస్కారంచేసి, "ఈ బాబుగారెవరు ?'' అని అడిగాడు. విమలబాబుగారు లంకమీద పంచదార మిల్లు పెట్టే ఆలోచనలో ఉన్నట్టు మైత్రా చెప్పాడు.

"మిల్లువచ్చాక దానిచుట్టూ చెరుకు పండిస్తారు. మీ భూమిలో కూడా చెరుకువెయ్యండి. మీ దుకాణంకూడా పెద్దదిచెయ్యండి. రెండునెలల్లో ఇక్కడికి బస్తీనుంచి పనివాళ్ళ ఇటుకలు తయారుచెయ్యటానికి వస్తారు. మీకు మంచిగిరాకీ,'' అన్నాడు మైత్రా.

విమలబాబు నడిపేమిల్లుల్లో చాలామంది సాంతాలీలు పనిచేస్తారు. అందుచేత ఆయనకు వాళ్ళభాష తెలుసు. అందుచేత ఆయన మాఝీల పెద్దఅయిన కమల్‌ను పిలిపించి, వాళ్ళభాషలోనే మాట్లాడి, "ఇవాళ మీ పండగటకాదూ ? ఇది తీసుకుని ఖర్చు చేసుకోండి" అంటూ పర్సులోనుంచి ఒకనోటు తీసిఇచ్చాడు.

అది పదిరూపాయల నోటవితెలిసి సాంతాలీలలో కలకలం బయలుదేరింది. తాను మిల్లు పెట్టబోతున్నాననీ, అందులో వాళ్ళంతా పనిచెయ్యాలనీ విమలబాబు అన్నాడు, వాళ్ళ అందుకుసమ్మతించారు.

మరికొంత దూరంవెళ్ళాక, సాంతాలీలు పండగపూజ చేసుకునే చోట ఆడవాళ్ళ అలంకరణలు చేస్తూండటం కనబడింది. వాళ్ళలో సారి కవిపించేసరికి విమలబాబు కళ్ళ జిలజిల్లాడాయి.

విమలబాబూ, మైత్రా వెళ్ళిపోయాక శ్రీవాస్ తన అభ్యుదయానికి పథకం ఆలోచించాడు. పచార్లుచేస్తూ మంచిపునాదితో దుకాణం కోసం మూడుగదుల ఇల్లువేయించాలి. భూమిధర పెరిగిపోతుంది.

అతనికొక గొప్ప ఆలోచన తట్టింది. సాంతాలీలచేత వేలిముద్రలు వేయించటంకాదు, తాకట్టుపత్రాలే రాయించుకుంటే వాళ్ళ


*Happy Diwali Greetings*

*To All Our Patrons & Well Wishers :*

# M/s. A-1 DYERS & DRY-CLEANERS

(Estd 1939)




**THE TORCH BEARERS IN THE FIELD OF DRY-CLEANING**

*Head Office & Works:* Rashtrapathi Road, Secunderabad — Phone: 74840.

*Branches*: Maredpally, Nampally, Ameerpet, P. No. 34216 and Super Bazar, Hyd'bad.

*Dist. Branches*: Warangal and Hanumakonda.

భూములు స్వాహాచెయ్యొచ్చు. అతను ఖాతాపుస్తకంమీద సిరాబుడ్డి దొర్లించేసి, "అయ్యో! అయ్యో!" అన్నాడు.

ఖాతాపుస్తకం పాడయింది. శ్రీవాస్ తనకొడుకుతో, "వెండర్ దగ్గిరికెళ్ళి ఓ యాభై డెమ్మీకాయితాలు తీసుకురా," అన్నాడు అతను కమల్‌తో. "మారీు, కాగితాలొచ్చాక వేలిముద్రలు వేద్దురుగానిలే ముందు ధాన్యం కొలుచుకోండి," అన్నాడు.

* * *

లంకలో పంచదారమిల్లు వస్తుందనగానే రాయ్ వంశంలోని భాగస్తులందరికీ ఆకలితో నోళ్లు తెరిచారు. రైతులు లొట్టలువేశారు. లంకమీద వట్టి వేళ్ళపొదలన్నీ పీకిపారేస్తారు; తనకు లాభసాటి వ్యాపారం అనుకున్నాడు అచింత్యబాబు.

రాయ్ వంశీయులలో కానీవాటా, అంటే అణాలో నాలుగో వంతువాటా గలవాడు హరీశుడు లంకమీద రాయ్‌లకు హక్కు లున్నాయని అతనివాదం. అయినా అది తన దౌహిత్రులైన చక్రవర్తులదంటే పోనీలెమ్మనుకున్నాడు. ఇప్పు డక్కడ పంచదార మిల్లు లేవబోతున్నదనీ, లంకభూమికి మంచిధర వస్తుందనీ, అదంతా చక్రవర్తులకు పోయిందనీ తెలిసి హరీశుడు సహించలేక పోయాడు. ఇంద్రరాయ్ తనకూతుర్ని చక్రవర్తుల కుర్రాడి కివ్వాలని ఉన్నాడనీ, అందుకే ఇంద్రుడు వాళ్ళ వ్యవహారాలు చూస్తున్నాడనీకూడా తెలియవచ్చింది.

హరీశుడు రాయ్ వంశీయులయిన భాగస్తులందరినీ తన ఇంట సమావేశపరిచాడు. అందరూ చేరి ఇంద్రరాయ్‌నీ, అతనికూతుర్నీ, కాబోయే అల్లుణ్ణీ నానా శాపనార్థాలూ పెట్టారు వాళ్ళందరూ ఇంద్రుడిఇంటికి వెళ్ళారు.

తనవాళ్లు ఇలా అలగాజనంలాగా కావటం కళ్ళారాచూసి ఇంద్రరాయ్ నిర్ఘాంతపోయాడు. తాను తనకూతుర్ని చక్రవర్తి కొడుక్కు ఇస్తున్నవార్తవిని ఇంకా ఆశ్చర్యపోయాడు.

ఇంద్రరాయ్ ఏమాటా చెప్పకపోవటం చూసి హరీశుడు, "అయితే మేం కోర్టెక్కక తప్పదా?" అని అడిగాడు.

"మీరాపనిచేస్తే నేను రామేశ్వరుడి పక్షమే అవుతాను," అన్నాడు ఇంద్రరాయ్.

అతను విమలబాబుకు తనవాళ్లు చేసే అడావుడి చెప్పాడు. విమలబాబు దస్తావేజులన్నీ శ్రద్ధగా పరిశీలించి, చక్రవర్తులదగ్గిర లంక కొనటానికి సిద్ధపడ్డాడు. సునీతికి కబురుచేస్తే, ఇంద్రరాయ్ ఏంచేసినా తన కభ్యంతరం లేదని జవాబుపంపింది. అయితే ఆమె ఒక్కటిమాత్రం కోరింది — తన దివాణంలో తరతరాలుగా పని చేసిన బాగ్దీలకు కొంతభూమి కేటాయించమని.

బాగ్దీలకోసం ఇరవై అయిదు బిఘాలు అమ్మకుండా ఉంచుతానని ఇంద్రరాయ్ మాటఇచ్చాడు.

లంకకు కొలతలు వెయ్యటానికి, దస్తావేజు ముసాయిదా




రాయించి ఉంచటానికి నిర్ణయం జరిగింది. విమలబాబును పంపేసి ఇంద్రరాయ్ సంధ్యావందనం చేసుకోవటానికి లోపలికి పోబోతుం డగా మజుందారు హాజరయాడు.

"చక్రవర్తిగారు నా కింకా బాకీ ఉన్నారు లంక అమ్మడవు తున్నట్టు విన్నాను. నాకు ఏం ఏర్పాటు చేస్తారు?" అని మజుందారు అడిగాడు.

"చక్రవర్తుల ఇంటికే వెళ్ళకపోయావా?" అన్నాడు ఇంద్ర రాయ్.

"ఆ ఇంటికి ఇప్పుడు మీరేగా యజమాని? మీరూ మీరూ వియ్యంకూడా అందబోతున్నారని విన్నాను." అన్నాడుమజుందారు.

"అవును ఆ ఆలోచనలోనే ఉన్నాను. మా డబ్బే దొంగిలించి మాకు అప్పు ఇచ్చావేమో. అయినా చక్రవర్తిగారు బాకీ అని తీసుకున్నది ఎగవెయ్యరు." అన్నాడు.

*　　　*　　　*

చలికాలం వచ్చేసింది లంకమీద లక్షలకొద్దీ ఇటుకలు కాలు తున్నాయి. మిల్లు కట్టడంపని సాగుతున్నది. ముందుగానే విమల బాబు ఒక బంగళా కట్టించి. అందులోనే ఉంటూ, పనులు చేయి స్తున్నాడు, ఆ పని వేగం చూసి లంకమీద ఉండేవాళ్ళు ఆశ్చర్య పోతున్నారు. అలాటి పనులు వా శ్చెరుగరు. ఈ పనులకుకావలసిన నీరంతా నదినుంచి పంపుతో వస్తున్నది. దానికోసం ఒక బాయిలరు పని చేస్తున్నది, మిల్లుకు కావలసిన యంత్రాలూ అవీ చేరు తున్నాయి.

విమలబాబుండే బంగళాముందు ఆవరణలో ఒక బావి. దాని చుట్టూ, అందానికీ, అవసరానికీ మొక్కలూ ఏర్పాటయాయి. మాఝీ మనమరాలు సారి విమలబాబుఇంట పనిచేస్తున్నది. రాయ్ హాట్‌లో చాలామంది విమలబాబుదగ్గిర ఉద్యోగాలుకూడా సంపా దించారు. రాయ్ మేనేజరు మైత్రా కొడుకుకూడా, ఇంద్రరాయ్ శిఫార్సుతో ఇక్కడ ఉద్యోగం సంపాదించాడు, కాని అతనా ఉద్యోగాన్ని నిలబెట్టుకోలేకపోయాడు, పనిచేతగాక.

ఒకరోజు ఇంద్రరాయ్ పొలాల్లో పనిచెయ్యమని సాంతాలీలకు కబురుపంపాడు. ఆ రోజు వాళ్ళు విమలబాబుపనికి రాలేదు. జమీం



బెంగాల్ ఎలెక్ట్రికల్ కంపెనీ, బెంగళూరు-3 & మదరాసు-17

దారీకి పెట్టుబడిదారీకి ఘర్షణవచ్చింది. "ఈ జమీందార్లు ఇడియట్స్!" అని విమలబాబు తిట్టుకున్నాడు.

విమలబాబు సాంతాలీ పల్లెలో అదివరకే ఒక సంచలనం లేవదీశాడు. అతను సారిని కొండచిలువ కట్టేసినట్టు కట్టేశాడు. ఒకనాడు సారి తన కుల పెద్దల ఎదటికి వెళ్ళి, పరిహారం కింద నూరు రూపాయలు కుమ్మరించి తన పెళ్ళి రద్దుచేయించుకున్నది. తరవాత కమల్ మాఝీ, సారిమొగుడూకూడా తమ పల్లెవిడిచి వెళ్ళిపోయారు. ఆట బొమ్మలు చేసేచూడా మాఝీ ఇప్పుడు సాంతాలీలకు నాయకుడు. కమల్‌మాఝీపేర ఉన్న భూమి తనకు తాకట్టున్నదని చెప్పి శ్రీవాస్ ఆ భూమిని కాస్తా కాజేశాడు.

కేసునడిచే సమయంలో మజుందారు శ్రీవాస్‌కు డబ్బు అప్పిచ్చి నోటు రాయించుకున్నాడు. మజుందారు తన నౌకరయాక విమలబాబు ఆ నోటును కొనుక్కున్నాడు. ఇప్పు డాయన మజుందారును పిలిచి, శ్రీవాస్‌కు లాయరునోటీ సిప్పించమన్నాడు, ఆయనకు కావలసింది డబ్బుకాదు – నూరు బిఘాలభూమి. చౌకగా!

మజుందారుతోనే విమలబాబు ఇంకోమాటకూడా చెప్పాడు. తన కింద పనిచేసే నౌకర్లను ఇంద్రరాయ్ సొంతపనులకు నియోగించటం తాను సహించలేడు.

లంకమీద సారాదుకాణం నడపటానికి విమలబాబు ఒక మనిషిని ఏర్పాటు చేశాడు. జమీందారు పనికి పిలిస్తే వెళ్ళొద్దని చెప్పే భారాన్ని విమలబాబు ఆ మనిషిమీద పెట్టాడు.

మిల్లు మేనేజరయిపోయిన మజుందారుకు ఇంద్రరాయ్ అంటే ఇంకా బెదురు అలాగేఉంది. అతను ఇంద్రరాయ్ ఎదటికివచ్చి నమస్కారం చేసి, "ముఖర్జీ దొరగారు నన్ను తమదగ్గిరికి పంపారు." అన్నాడు విమలబాబును ఇప్పుడందరూ ముఖర్జీదొర అంటారు.

"కూర్చో, కూర్చో!" అన్నాడు రాయ్, "ఏమిటి విశేషం?"

"నామీద మాత్రం ఆగ్రహించకండి," అన్నాడు మజుందారు.

''దూత అవధ్యుడే. నీ ప్రాణాని కేమీ భయంలేను. ముఖర్జీ దొర సందేశమేమిటి"?

మజుందారు ధైర్యాన్ని చిక్కబట్టి. "లంకలో ఉండే సాంతాలీలమాటే. వాళ్ళకు దొరగారు ముందే బజానాలిచ్చేశారు. దొంగ ముండాకొడుకు శ్రీవాస్ వాళ్ళచేత స్టాంపు కాయితాలమీద వేలిముద్రలు వేయించి వాళ్ళ భూములను తాకట్టుపెట్టుకున్నాడు ముఖర్జీగారు ఆ సంగతి తెలిసి ఆ పత్రాలన్నీ తామే కొనేశారు. సాంతాలీలు వారికిప్పుడు రుణపడి ఉన్నారు. కూలిచేసి బాకీ తీర్చాలి. వాళ్ళు తమ కూలిడబ్బుల్లోంచి ఒక అణా బాకీలో చెల్లువేస్తున్నారు. ఈ స్థితిలో తమరు కూలీలను ఆపుచేస్తే ఏమయేదీ చూడండి." అన్నాడు.


గర్భిణీ స్త్రీలకు
అమృతసంజీవిని మాత్రలు
సుఖ ప్రసవమునకు ఆరోగ్యమైన సంతానమునకు
నేవిళ్లు నిస్త్రాణ తగ్గించుటకు గర్భవతులు
ప్రసవించువరకు సేవించదగినవి



పిల్లల సమస్త అనాసలకు ఉదరాంతకి
చంటిబిడ్డల లివర్ స్ప్లీన్ వ్యాధులు అనాసలు నివారించును
కడుపుబ్బరము అజీర్ణము పాలుకక్కుట విరేచనబద్ధము
పోగొట్టి బలము చేకూర్చును

శ్రీ భుజంగరాజ వైద్యశాల
ప్రొప్రయిటర్స్: 'భిషక్ శిరోమణి' పొన్నాడ పేరయ్యా అండ్ సన్స్
తాళ్లరేవు * తూర్పుగోదావరి జిల్లా
AKRUTI

చక్రవర్తి ఇంటి వ్యవహారాలు చూడటానికి మైత్రా అన్న కొడుకైన రాధారమణను ఇంద్రరాయ్ ఏర్పాటుచేశాడు. ఇప్పు డాయన రాధారమణకేసి ప్రశ్నార్ధకంగా చూశాడు.

''ఎందుకు ఆపుతాం! మార్గశిరంకూడా అయిపోతున్నది. ఇంత వరకూ యవలూ, గోధుమలూ అవీ చల్లనేలేదు. మార్కీులిప్పుడు అచ్చగా మిల్లులోనే పనిచేస్తున్నారు. అందుచేత ఈ పనులు కాస్త పూర్తిచేసి ఇంకేమైనా చేసుకోమని చెప్పాం,"అన్నాడు రాధారమణ.

"భాగస్వాములు కానివారుకూడా మీ పేరు చెప్పి వెట్టిచేయించు కుంటున్నారు," అన్నాడు మజుందారు.

"ఇంతకూ ముఖర్జీగారేమంటారు?" అని రాయ్ అడిగాడు.

"మీరు వెట్టిచేయిస్తూపోతే మా కెలా కుదురుతుందండీ? అదీ కాక వెట్టి చట్టవిరుద్ధం."

"మీ ముఖర్జీ దొరగారికి చెప్పు. పాదుషాలు మాకు పట్టాలిచ్చి నప్పటినుంచీ వెట్టి చేయించుకుంటున్నాం. ఇక ముందుకూడా చేయించుకుంటాం. అవసరమైతే మీ ముఖర్జీ దొరచేతకూడా వెట్టి చేయించవలిసొస్తుంది," అన్నాడు రాయ్.

"అంతా మీ చేతిలో ఉంది. ఇక ఉమని అహీన్‌కిచ్చి పెళ్ళి చెయ్యండి."

"అదే జరిగితే ముందు నీకే తెలుస్తుంది. చక్రవర్తుల మాజీ మేనేజరువుగా? నీకు దుశ్శాలువలు కప్పుతాం." అన్నాడు ఇంద్ర రాయ్.

మజుందారు మంచిగా చెబుతున్నట్టుగా, విమలబాబుకు న్యాయా న్యాయాలు లేవనీ, దుష్టుడనీ, సొంతాలీల విషయంలో రాజీపడమని ఇంద్రరాయ్‌కి సలహా ఇచ్చాడు.

"వ్యాపారం చేసుకునేవాళ్ళు కొత్తగా నేరుస్తున్నారు గాని, పాతకాలం వాళ్ళకు దుమ్ము లేపటం కొట్టినపిండే ఏమీ భయంలేదు."

మజుందారు వెళ్ళిపోయాడు.

ఇంద్రరాయ్ మైత్రాని పిలిచి, "నదిలో పెట్టిన పంపింగ్ పరిక రాలను ముందు ఆపుచేయించు. లంకను విక్రయించటానికీ, కాళిందీ నదీకీ ఏమీ సంబంధం లేదు," అన్నాడు.

మజుందారు నదిదగ్గిర చేరేసరికి నది అవతల లంకలో ఫాక్టరీ పన్నెండుగంటల కూత కూసింది. అచింత్యబాబూ, హరీశుడూ, శూలపాణి అనే మరో చితికిపోయిన రాయ్ వంశీయుడు ఎదు రయారు. వాళ్ళంతా విమలబాబుకింద చేరినవాళ్ళే.

నలుగురూ ఇంద్రరాయ్ గురించే మాట్లాడుకున్నారు. ఇంద్ర రాయ్ తనతో అన్న మాటలన్నీ మజుందారు వాళ్ళకు చెప్పాడు.

"రాయ్ అల్లుడికోసం మంచి దెబ్బ తింటాడు," అన్నాడు అచింత్యబాబు.

సౌందర్య పోషణకు కేశాలంకరణ ఒక సాధనం



బెంగాల్ కెమికల్ వారి

కాంథారిడైన్

హేరాయిల్

తమ శిరోజములను గురించి శ్రద్ధ తీసుకునేవారు బెంగాల్ కెమికల్ వారి కాంథారిడైన్ హేరా యిల్‌నే ఎంచుకొంటారు. ప్రతినిత్యమూ ఈ నూనెను వాడుటవలన జుట్టుకు జిడ్డును చేరనీయక, నిగనిగలాడే కురులను పొడవుగా పెరుగుటకు తోడ్పడుటయేగాక, రాలనీయదు. ప్రతి యింటను తప్పక ఉండతగినది.

BENGAL CHEMICAL

CALCUTTA ● BOMBAY

KANPUR ● DELHI

మజుందారు ఒప్పుకోలేదు. రాయ్ తన కూతుర్ని చక్రవర్తుల పిల్లవాడికిచ్చేమాట నిజం కాదన్నాడు.

"రామేశ్వరబాబు రాయ్ ఇంటి ఆడబడుచును తన గుమ్మం తొక్కనివ్వడు. అందుచేత రాయ్ఆలోచనలు పారవు," అన్నాడు అచింత్యబాబు.

"ఆమాట నిజం," అన్నాడు హరీశుడు. రాధారాణి తెచ్చిన అపఖ్యాతి తలుచుకుని.

ఆ సాయంత్రం రాయ్ వంశీయులు కుక్కల్లాగా మొరిగారు. ఒకామె లోపలికి వచ్చి, హేమాంగిని ముఖాన చేతులాడిస్తూ, "అంతా తెలిసిందిలే. చక్రవర్తులు చెప్పుతీసుకు కొట్టారుటగా? చక్రవర్తులు ఈ పిల్లని చేసుకుంటారని ఎలా అనుకున్నారూ? ఏ మొహం పెట్టుకుని వాళ్ళదగ్గిరికి వెళ్ళారూ? అయ్యోరాత! లంకని చక్రవర్తుల యెదాన పెట్టి, అల్లుడికోసం నగరం కట్టించారు! అయ్యోరామ!" అని చిందులు తొక్కుతూ వెళ్ళిపోయింది.

పైన జపనిష్టలో ఉన్న ఇంద్రరాయ్ ఈ రామాతను తలుచుకుని ఎంతో నిగ్రహం తెచ్చుకున్నాడు. తరవాత అతను కిందకి దిగి వచ్చి. "మంచిచీరెకట్టుకో, హేమా. ఉమకు సంబంధం మాట్లాడటానికి రామేశ్వరు డింటికి పోదాం," అన్నాడు.

దీపం తీసుకుని ముందు చప్రాసీ, వెనకగా మరో చప్రాసీ రాగా ఇంద్రరాయ్ ఎన్నో ఏళ్ళ అనంతరం మళ్ళీ రామేశ్వరుడి గుమ్మం తొక్కాడు.

రామేశ్వరుడిలో కలిగిన మార్పుకు ఇంద్రరాయ్ స్తంభించిపోయాడు. పచ్చగుడ్లు తప్పిస్తే రామేశ్వరుడిలో పోల్చుకునేటందుకేమీలేదు.

రామేశ్వరుడు ఉద్రేకంలో వణికిపోతున్నాడు. దాన్ని నిగ్రహించుకునేటందు కాయన విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు.

"ఎలా ఉన్నావు?" అని రాయ్ అడిగాడు,

"మర్రిచెట్టు ఛేదించిన ఇల్లులాగా వ్యాధితో శరీరం బీటలుపడి, కూలిపోవటానికి సిద్ధంగాఉంది, ఇంద్రా," అన్నాడు రామేశ్వరుడు.

ఇంద్రరాయ్‌కి కన్నీ రాగలేదు "అలా అనకు, రామేశ్వర్. నీకు నయమవుతుంది. ఇప్పుడొచ్చిన పెద్దవ్యాధిమాత్రం ఏమిటని?"

"కనబడటం లేదూ?" అంటూ రామేశ్వరుడు తనచేతులను దీపపు కాంతికేసి చాచాడు. చేతులు శుభ్రంగా ఉన్నాయి.

"ఏమీలేదు. నువు భ్రమపడుతున్నావు. జబ్బు నీ మనసులో ఉంది. మనసును దృఢం చేసుకో. నీ కొడుక్కు పెళ్ళి చెయ్యి, భార్యనూ, కొడుకునూ, కోడలినీ పెట్టుకుని ఆనందంగా ఉండు," అన్నాడు రాయ్.

రామేశ్వరుడు పైకేమీ అనలేదు. తనలోతాను మాట్లాడు కుంటు


ఫోన్: 42626

అందరికీ దీపావళి శుభాకాంక్షలు!

✲ ఆంధ్ర రాజధానిలో
✲ ఆంధ్రప్రజల ఆదరాభిమానములతో

ప్రఖ్యాతి గాంచిన

రవీంద్ర హోటల్

(బోర్డింగ్ & లాడ్జింగ్)

ఆబిద్‌రోడ్, హైదరాబాద్

రుచికరమైన మాంసాహార, శాకాహార భోజనం; విశ్రాంతికి పరిశుభ్రమైన గాలివచ్చు గదులు, అన్ని ఆఫీసులకు, వ్యాపారసంస్థలకు అతి దగ్గర

మర్యాద మన్ననలకు ప్రసిద్ధిగాంచిన

మీ రవీంద్ర హోటల్

న్నట్టుగా పెదవులు కదిలించాడు. ఆయన వాలకం చూస్తే రాయ్‌కి కాస్త భయంవేసి, "రామేశ్వర్!" అని పిలిచాడు.

"ఏమిటి చెబుతున్నావు?" అని రాయ్ అడిగాడు రామేశ్వరుడు తనకేసి చూడగానే.

"తమసోమా జ్యోతిర్గమయ అని ప్రార్థిస్తున్నాను. ఈ చీకటిలో ఉండటం దుర్భరంగా ఉంది." అన్నాడు రామేశ్వరుడు

హేమాంగిని రామేశ్వరుడికి ఎదురుగా వచ్చి, "నన్ను మీరు పలకరించనైనా లేదు. నాకు కోపం వస్తున్నది. చక్రవర్తిగారూ." అన్నది.

ఆమెను చూడగానే రామేశ్వరుడి ముఖంలోకి కొంచెం వికాసం వచ్చింది. "మీరూ వచ్చారా? స్వప్నోను మాయాను మతిభ్రమోను..." అని శ్లోకం చదివాడాయన.

హేమాంగిని ఆనందంతో పొంగిపోతూ, "నేను కలకాదు, మాయాకాదు, మతిభ్రమాకాదు — మీ కాబోయే వియ్యపురాలిని." అన్నది.

రామేశ్వరుడు నవ్వి "అపారమైన నా పాపసముద్రం మధ్య రవ్వంత పుణ్యం నిలిచి ఉందన్నమాట. అందుకే దేవి దర్శనమిచ్చింది," అన్నాడు.

"తారామాతా!" అని గట్టిగా అన్నాడు రాయ్.

గోడనున్న గడియారం గంటలు కొట్టేసరికి, తాను చూసుకుని వచ్చిన యోగకాలం ఇంకెంతో లేదని రాయ్‌కి జ్ఞాపకం వచ్చి, "రామేశ్వర్, ఇవాళ నేను నిన్ను యాచించవచ్చాను." అన్నాడు.

"వారు యాచించ వచ్చామన్నారుగాని, నేను దోపిడీచేయ వచ్చామంటాను. ఇవ్వనంటే నిర్భయంగా లాక్కుపోతాం." అన్నది హేమాంగిని.

రామేశ్వరుడు గంభీరంగా, "రాయ్ గృహిణీ, మా భాండారం తలుపులు తెరుచుకుని లక్ష్మి వెళ్ళిపోయింది. ఆ శూన్య భాండారంలో మీకు ధూళితప్ప ఇంకేమీ దొరకదేమోనని సిగ్గుగా ఉంది," అన్నాడు.

"అలా అనకండి. సునీతి ఉన్నచోట ధూళి ఎలా ఉంటుంది? మీ యిల్లు శూన్యంకాదు. అందులో ఒక వజ్రం ఉన్నది. దానిమీది ఆశతో వచ్చాం. మా దగ్గిర రవ్వంత బంగారం ఉన్నది. మీ వజ్రాన్ని మా బంగారంలో తాపి, నేనూ సునీతీ సమిష్టిగా ధరిస్తాం," అన్నది హేమాంగిని.

ఇంద్రరాయ్ విట్టూర్చాడు. ఇలా మాట్లాడటం ఆతనివల్లకాదు. అందరి ముఖాలా ఆనందరేఖలు తోచాయి. కాని రామేశ్వరుడు మాత్రం తీవ్రాలోచనలో ఉన్నట్టు కనబడుతూ, "లక్ష్మి వెళ్ళిపోతూ నా మనసుకూడా ఖాళీచేసి పోయింది. ఇంకొంచెం స్పష్టంగా చెప్పండి," అన్నాడు.

"రామేశ్వర్, ఆడపిల్ల పెళ్ళిచేసే బరువుతో కుంగిపోతున్నాను.


*Helping the farmer to grow more food*

THE STATE BANK OF HYDERABAD

Through over 147 offices, The State Bank of Hyderabad offers financial and other assistance to the Indian Farmer, not only through co-operative banks but also directly through the co-operatives themselves such as marketing and processing societies, sugar, factories, industrial co-operatives, consumer and wholesale stores and others.

STATE BANK OF HYDERABAD

మా ఉమను మీ అహీంద్రుడికి చేసుకోమని అడగవచ్చాం." అన్నాడు రాయ్.

"మా ఉమను మీరు చూశారు. మీకు బెంగాలీకవిత వినిపిస్తుంది. ఆ పిల్లే," అని హేమాంగిని అందించింది.

రామేశ్వరుడు ఏమీ అనకుండా తమముఖాలకేసి చూస్తూ ఉండటం గమనించి రాయ్ దంపతులు భయపడ్డారు. కొంచెం సేపయాక రామేశ్వరుడు తన ముఖం వికారం చేసుకుని, "ఛీ, ఛీ! నాకు కుష్ఠురోగం వచ్చింది. నా రక్తమే నా పిల్లల్లోనూ, ఉమ దేవకన్య అలా అనకండి!" ఆయన మనసు చెదిరిపోతున్నది. "ఎవరు? ఎవరిమాట చెబుతున్నారు? అన్నాడు.

హేమాంగిని తన భర్తకు మాట్లాడవద్దని సైగచేసి, రామేశ్వరుడికి దగ్గిరగా వచ్చి "ఆమెచెప్పింది. సంతోషంగా చెప్పింది," అన్నది.

రామేశ్వరుడు కళ్ళు జలజలా నీరుకారుస్తూ, "అనుమతి ఇచ్చిందా? ఏమని చెప్పింది?" అని ఆత్రంగా అడిగాడు

"ఈ వివాహం జరక్కపోతే ఆమెకు గతులుండవు. శాంతి ఉండదు," అంటూ హేమాంగిని ఏడ్చింది.

"తారా, మాతా!" అనుకున్నాడు రాయ్.

కొంచెం సేపాగి హేమాంగిని, "ఇంతకూ మా మాటకు ఏం చెబుతారు," అని హేమాంగిని అడిగింది.

"ఉమ పర్వతరాజ పుత్రి. ఇంద్రుడు ఇష్టదేవి ఆదేశం పొందాడు. ఇది మా అదృష్టమే. చక్రవర్తుల ఇంటిలక్ష్మి తిరిగి రాపోతున్నది. శంఖం పూరించు, సునీతి!" అన్నాడు రామేశ్వరుడు.

* * *

రాధారాణి తమ వంశానికి తెచ్చిన కళంకం తొలగిపోయిందనిపించి, ఇంద్రరాయ్ ఉత్తేజితుడయాడు. అహీన్‌ను రమ్మని సునీతిపేర టెలిగ్రాం వెళ్ళింది. ఉమను వెంటపెట్టుక రమ్మని ఇంద్రరాయ్ అమల్‌కు టెలిగ్రాం ఇచ్చాడు.

అర్ధరాత్రికి అమల్ ఉమనూ, అహీన్‌నూ వెంటపెట్టుకు వచ్చేశాడు.

అహీన్ ఇంట్లో అడుగుపెట్టి మానదాను చూస్తూనే, "నాన్నగారెలా ఉన్నారు?" అని అడిగాడు.

"కులాసాగానే ఉన్నారు. అందరూ క్షేమంగానే ఉన్నారు," అన్నది మానదా.

"అయితే టెలిగ్రా మిచ్చారెందుకూ?"

"మీ పెళ్ళి, అబ్బాయిగారూ! మీకూ, ఉమాదేవికీ పెళ్ళి!" అన్నది మానదా.

అహీన్‌కు శరీరమంతా ఝల్లుమన్నది. అతను ఉమను ప్రేమిస్తున్నట్టు ఈ క్షణంలోనే తెలుసుకున్నాడు.


Phone: 81788, 81845 & 25096 Grams: "PRINTMACHO"

**WE DONT WHISPER BUT CLAIM**

That the Number of 'PLANETA OFFSET' made in German Democratic Rebublic, far exceeds the sum total of all the other Brands installed in our country. Planetas are popular because these are built by experienced and skilled hands whose precision has been universally accepted for decades.

**AVAILABLE IN VARIOUS SIZES IN SINGLE OR MULTI-COLOUR UNITS**

*Please Contact for your Requirements*

***Sole Agents for South India***

**THE STANDARD PRINTING MACHINERY CO.,**

**9, MOUNT ROAD, MADRAS-2.**

ఇంతలో సునీతి వచ్చి, "లోపలికిరా, నాయనా! నీకోసం మేలుకునే ఉన్నాం." అన్నది.

ఆమెను చూడగానే అహీన్‌కు అన్న జ్ఞాపకం వచ్చాడు, అతను తల్లితో, "ఏం పని చేశారమ్మా! ఛీ, ఛీ! ఇలా జరగటానికి వీల్లేదు. అన్న సంగతి మరిచారా, అమ్మా!" అన్నాడు. అతవి కళ్ళవెంట జలజలా నీళ్ళు రాలాయి.

సునీతి అతన్నిచూసి జాలితో నవ్వుతూ, "మాటఇచ్చాం తల్లిదండ్రుల ఆజ్ఞ పాలించటం నీకు తప్పుకాదు, నాయనా!" అన్నది అహీన్‌కు అన్ని సంగతులూ చెప్పింది "మీ పెత్తల్లి ఏదో విపరీతమైన పరిస్థితిలో అభిమానంకొద్దీ రహస్యంగా ఆత్మ హత్య చేసుకున్నది, ఆ దెబ్బతోనే మీ నాన్నగారికి మతిభ్రమకలిగి ఇలా అయిపోయారు. లోకులు ఆమెకు కళంకం అంటగట్టి అప కీర్తి ప్రచారం చేశారు. ఆ కళంకాన్నినువ్వూ, ఉమా తుడిచెయ్యాలి, బాబూ. ఉమతల్లి అన్నది – ఈ పెళ్ళి జరక్కపోతే ఆమె ఆత్మకు శాంతి ఉండదు, ఆమెకు ఉత్తమలోకా లుండవు. అది నిజం, నాయనా!"...

పెళ్ళికిముందు వధువు తండ్రి వరుడి ఇంటికి వెళ్ళి కాబోయే అల్లుణ్ణి ఆశీర్వదించటమూ, ఆ తరవాత వరుడితండ్రి వచ్చి వధువును ఆశీర్వదించటమూ సాంప్రదాయం.

వరుడి ఆశీర్వాదానికి ముందుగానే, ఇంద్రరాయ్ ఎంతో హృదయ వైశాల్యం ప్రదర్శించాడు. ప్రస్తుతం చక్రవర్తులకు మేనేజరుగా ఉంటున్న రాధారమణుణ్ణి మజుందారు దగ్గరికీ, విమలబాబు దగ్గిరికీ పంపాడు. రాధారమణ మజుందారు దగ్గిరికి వెళ్ళి, "పెదబాబుగారి స్థితి మీకు తెలుసుగద. ఆ యింటి మర్యాదలు మీకు తెలిసినట్టు మ రెవరికీ తెలీదు. మీరులేకుండా ఏ పనీజరగదని అమ్మగారు చెప్ప మన్నారు," అన్నాడు.

మజుందారు గతుక్కుమని, "నేను నింపాదిగా వస్తాలే," అన్నాడు.

"అంతా మీ చేతిమీదిగా జరిపిస్తా ననిమాట ఇవ్వాలి. రాయ్ గారు మిమ్మల్ని ఒక్కసారి కలుసుకోమన్నారు."

మజుందారు మరింత కంగారుపడ్డాడు – కాని వెళ్ళాడు.

"నీ నోటి చలవవల్ల నువ్వానా దన్నమాట నిజమయింది. నిజమైతే నీకే ముందరతెలుస్తుం దని నే నప్పుడే అన్నాను. చక్ర వర్తుల ఇంటిపనులన్నీ నువేచూడాలి. అంతే కాదు, వధువు ఆశీర్వాదానికి వారు వచ్చేటప్పుడు ఆ ఇంటిపెద్దవుగా నువేరావాలి," అన్నాడు ఇంద్రరాయ్.

మజుందారు నోటమాట రాలేదు. కాని రాయ్‌కోరినట్టు చెయ్యటానికి హృదయపూర్వకంగానే ప్రయత్నించాడు.

ఆహ్వానం అందుకుని ఆశీర్వాదానికి వచ్చిన విమలబాబుతో, "మీరు పెళ్ళికొడుకు పక్షంవారు. ఇవాళ మేం మీతో వియ్య


## మీ ఆదాయం మీకు తృప్తిగా ఉందా?

నూటికి కోటికి ఏ ఒకరికో తప్ప అందరికీ తృప్తిలేదు. ఐతే– మీ తీరిక సమయాల్లో అదనంగా ఆర్జించే మంచి మార్గం ఒకటి మీ ముందు ఉంది! మార్గదర్శి చిట్ ఫండ్ ఏజెంట్‌గా చేరితే, ఆదాయంతో ఆనందాన్ని, సమాజంలో గౌరవప్రతిష్ఠల్ని సంపాదించవచ్చు! మీరు చేర్పించే ప్రతి పద్దుకీ నికరమైన మంచి కమీషన్ మీ చేతికి వస్తుంది!

మార్గదర్శి ఏజెంట్‌కి – మూడు లాభాలు!

* 'ఆర్థిక విషయాలు క్షుణ్ణంగా తెలిసిన వ్యక్తి' అనే పేరు ప్రతిష్టలు మీకు లభిస్తాయి.
* సులభమైన వాయిదాల్లో పెట్టుబడి పెట్టించి, మీ స్నేహితులకు, పరిచయస్తులకు ఇతోధిక లాభం పొందే మార్గం మీరు చూపినవారవుతారు. వారి నమ్మకాన్ని, ఆప్యాయతనీ సంపాదించిన తృప్తి మీకు లభిస్తుంది!
* ఇహంపరం అన్నట్లుగా ఈ లాభాలకు తోడు మీ స్వంత ఆదాయం పెరుగుతుంది. సుఖం శాంతి మీకు లభిస్తుంది.

ఈ 6 ప్రశ్నలకు మీ జవాబు మూడక్షరాలే!!

మార్గదర్శి ఏజెంట్‌గా ముందు ఈ ప్రశ్నలకు జవాబు ఆలోచించండి!

1. అదనంగా డబ్బు సంపాదించాలని ఉందా?
2. పదిమందినీ కలుసుకోవాలనే ఆసక్తి ఉందా?
3. ఇతరులకు మంచిమార్గం చూపాలని ఉందా?
4. వారానికి కొద్దిగంటలు అదనంగా పనిచేయాలని ఉందా?
5. పొదుపుచేయాలన్న ఆసక్తి, నమ్మకం ఉందా?
6. పదిమందిలో హోదా (గౌరవప్రపత్తి) పెంచుకోవాలని ఉందా?

మీ జవాబు 'అవును' అన్న మూడక్షరాలే అయితే వెంటనే మార్గదర్శి ఏజెంట్‌గా చేరి ఆదాయాన్ని, ఆనందాన్ని పొందండి! క్రమబద్ధమైన కార్యక్రమం సాగించండి! అదనంగా ఆర్జించే శక్తిని పెంపొందించుకోండి!

మార్గదర్శి ఏజెంట్‌గా దరఖాస్తు పెడితే-కోరిన వివరాలు ఉచితంగా పంపుతాం.

✲ నేను మార్గదర్శి చిట్ ఫండ్ ఏజెంట్‌గా చేరాలని కోరుకొంటున్నాను.

పేరు :..........................................

చిరునామా:.....................................

వృత్తి:..........................................

డబ్బు గురించి ఆలోచిస్తే, మార్గదర్శిని గుర్తుంచుకోండి!

మార్గదర్శి

చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్

ఆబిడ్ సెంటర్, హైదరాబాదు-1. ఫోను: 46225

మందుతున్నాం మమ్మల్ని మీరు మర్యాదచెయ్యాలి. మా యింటి దగ్గిరమమ్మల్ని గౌరవిస్తాం.'' అన్నాడు ఇంద్రరాయ్.

ఇంటిముందు ఆవరణలో సొంతాలీలు మద్దెలలు వాయిస్తూ, పాటలుపాడుతూ, ఉత్సాహంగా నృత్యాలు చేస్తున్నారు. బాగ్దీలకు ఎర్రటి తలగుడ్డలూ, చేతుల్లేని చొక్కాలూపెట్టారు. వాళ్ళు వాటిని ధరించి, చేతికర్రలు పట్టుకొని పహరా వాళ్ళలాగా అక్కడక్కడా నిలబడి ఉన్నారు. నవీన్ భార్య మతి బాగ్దీ కొత్తచీరె బిగించికట్టి, కర్ర చేతబట్టి ఆడవాళ్ళ గుమ్మందగ్గిర నిలబడింది.

ఆశీర్వాదం పూర్తికాగానే అహీన్, అమల్‌తోసహా సొంతాలీల ముందుకువచ్చి నిలబడి, నవ్వుతూ వాళ్ళ నృత్యాలు చూడసాగాడు. అకస్మాత్తుగా అతని నవ్వు మాయమయింది. సొంతాలీలలో కమల్ మాఝీలేడు, అతని మనమరాలు సారి కూడా లేదు.

వాళ్ళపాట అయిపోయాక చూడా మాఝీ వచ్చి, "దండాలు, రాంగాబాబుగారూ. వీళ్ళు పాడినపాట నేనే కట్టా," అన్నాడు.

"అలాగా ?... మీ నాయకుడు కమల్‌మాఝీ, సారీ, దాని మొగుడూ ఏరీ ? వాళ్ళంతా ఏమయారు ?'' అని అహీన్ చూడాను అడిగాడు.

చూడా చాలా సేపు నిశ్శబ్దంగా ఉండిపోయి, "వాళ్ళు పాపంచేశారు, బాబూ, వాళ్ళను మావాళ్ళు వెలేసి, వేరుచేశారు. మాతో ఉండటానికి మొహంచెల్లక ఎటో పారిపోయారు," అన్నాడు.

చూడా ఇప్పుడు మోడల్ (సొంతాలీలకు పెద్ద) అయిన సంగతిమాత్రం అహీన్ గ్రహించాడు. సొంతాలీలు మళ్ళా ఆటలూ, పాటలూ సాగించారు.

మర్నాడు సాయంకాలం ఉమకు ఆశీర్వాదం జరిగింది. ఆశీర్వాదానికి చక్రవర్తుల ఇంటి కులగురువువచ్చాడు. ఈ ఉత్సవాన్ని ఇంద్రరాయ్ చాలా వైభవంగా జరిపాడు. రాయ్ వంశీయుల నందర్నీ ఆహ్వానించాడు. భోజనాలు పెట్టాడు. మజుందారుకు ఖరీదైన బట్టలుపెట్టాడు.

విమలబాబు మాత్రం ఈరోజు రాలేదు. ఒంట్లో బాగాలేదని తప్పించుకున్నాడు.

మర్నాడు అపరాహ్ణంవేళ హేమాంగిని ఉమను వెంటబెట్టుకుని, రామేశ్వరుడికి నమస్కారం చేయించటానికి వచ్చింది. రామేశ్వరుడు ఉమ అందాన్ని వర్ణించటానికి కుమార సంభవంలోని పార్వతీదేవి వర్ణన శ్లోకంచదివాడు. తనదారిద్ర్యం జ్ఞాపకం చెయ్యటానికి మరోశ్లోకం చదివాడు.

ఏమనటానికీ పాలుబోక ఉమ, ఆ శ్లోకాల్లోని కవిత్వం చాలా బాగున్నదన్నది.

"ఇంకేం ? కోడలికి సంస్కృతం నేర్పండి," అన్నది హేమాంగిని.


# R. K. INDUSTRIES

**MAIN ROAD, VELACHERY, MADRAS-42.**

Grams: "ARTHENE," MADRAS-1

***Offers:***

**POLYTHENE LAY FLAT TUBES, BAGS, SHEETS Etc.**

★

***Proprietors:***

## K. ORR & COMPANY

**16, STRINGER'S STREET, MADRAS-1**

Phone: 23019 & 23526 — Grams: "PRESUNDRY"

**Agents & Stockists:**

Paper, "Lustracote" Art Paper,
Printing Inks (Coates) &
Other Printers' Sundries,
"PAI" Teleprinter & Telex
Paper Rolls and "Insta" Numbering,
Machines, Etc.

**Indents booked for:**

Paper, Process Zinc & Copper Sheets,
Lithographic Zinc Sheets,
Hardware, Match Chemicals,
"KG" Zip Fasteners,
Nylon Zip Fasteners etc.

రామేశ్వరుడి కళ్ళు మెరిశాయి. "తప్పకుండా నేర్పుతాను... అన్నట్టు నీ బెంగాలీ కవి రవీంద్రుడి పుస్తకం తెప్పించాను. కళ్ళు మూలంగా చదవలేను. కాస్తచదివి వినిపిస్తావా, తల్లీ ?" అని ఉమను అడిగాడు.

ఉమ ఆ పుస్తకమంతా చదివి వినిపించి, కిందికిదిగి వచ్చేసి, అహీన్ గదిపక్కగా వరండావెంబడి నడుస్తూ, కిటికిలోనుంచి లంకను చూస్తున్న అహీన్‌ను చూసి ఆగి, "గుడాఫ్టర్‌నూన్, దొరగారూ !" అన్నది.

అహీన్ వులిక్కిపడి, వెనక్కుతిరిగి చూసినవ్వి, "నమస్కారాలు, శ్రీమతి ఉషాదేవీ !" అన్నాడు.

"ఏమిటో తదేకంగా ఆలోచిస్తున్నారు ?"

"లంకే. కిందటి నవరాత్రులకు లంకంతా దుబ్బుల అరణ్యంతో పచ్చగా ఉంది. ఈ యేడిక్కడ ఒక నగరం !"

"అన్నట్టు ఓ సాంతాలీపిల్ల ఇవాళ నన్ను చూడవచ్చింది. నన్ను రాంగాతాకూ రాణి అని పిలిచింది. ఆమె పేరుకూడా బాగుంది—సారి...అమ్మా వాళ్ళు వస్తారేమో, నేను పోతాను." అంటూ ఉమ వెళ్ళిపోయింది.

తరవాత అహీన్ మానదాతో, ''నేను లంకకేసి పోతున్నాను అమల్ వస్తే నేను రమ్మన్నానని చెప్పు.''అని తనుకూడా బయలుదేరాడు.

* * *

అహీన్ నది మధ్య నిలబడి లంకను చూశాడు. మిల్లు నిర్మాణం ఇంకా పూర్తికాలేదు. లంకంతా తేనెపట్టులాగుంది. నగరం రూపు దాల్చుతున్నది. ఇప్పుడక్కడ కాలి మార్గాలు లేవు. అన్నీ రాజమార్గాలే, సాంతాలీ స్త్రీలు పనులుచేస్తూ పాటలు పాడటం మానేశారు. వాతావరణంతో బాటు వాళ్ళ అలవాట్లూ మారినట్టున్నాయి. లంకమీది మన్ను వెనకటిలాగా సారవంతంగా కంటికి కనబడటం లేదు. శాస్త్ర విద్యార్థి అయిన అహీన్ ఆధునిక వైజ్ఞానిక ప్రగతికి అబ్బురపడిపోయాడు.

ఎక్కడా వ్యవసాయ చిహ్నాలు లేవు. సాంతాలీలందరూ దబ్బు కాశపడి కూలిపనులకు దిగిఉంటారు. అహీన్ ఉద్దేశం కమల్ మాఝీని కలుసుకోవాలని. సారి ఉమను చూడ రావటాన్నిబట్టి కమల్ సాంతాలీ పల్లెకు దగ్గరలోనే ఉండి ఉంటాడనుకున్నా డతను.

అతను సాంతాలీ పల్లెచేరగానే ఎవతో చూసి, "రాంగాబాబు," అన్నది. నలుగు రాడవాళ్ళు, అతన్ని ఒకపీటవేసి కూర్చోబెట్టి, ఆతనిచుట్టూ మూగారు. తమలోతాము కిలకిలనవ్వుతూ కాస్సేపు మాట్లాడుకున్నాక ఒకతె, "పెళ్ళికూతురెట్లా వుంటుందో అడగమంటున్నారు వీళ్ళు," అన్నది.

"నే నెందుకు చెబుతానూ ? మీరు వెళ్ళి చూసిరండి. సారివచ్చి, చూసి వెళ్ళింది," అన్నాడు.


స్థాపితం 1957 ఫోన్లు: 917, 1192, 1545

ఇది నా దేశం
మనమంతా సోదరులం
మన పండుగ దీపావళి
వెలుగును వెదజల్లటం
అజ్ఞాతంగా యున్న శక్తిని
వెలుగులోనికి తీసుకురావటం
మా లక్ష్యం.

★

## రవి ట్యుటోరియల్ కాలేజి

(బాలబాలికలకు—ఇంగ్లీషు తెలుగు మీడియంలో)

★

వేర్వేరు కళాశాలలు, 6 హాస్టల్సు, లేబొరేటరీ వసతులు; మెట్రిక్, ప్రీయూనివర్సిటీ, యస్. యస్. యల్. సి. క్లాసులకు

★

క్లాసులకు, క్రమశిక్షణకు మారుపేరు

2, 3, 4 లైనులు - బ్రాడీపేట - గుంటూరు - 2

C. V. N. DHAN, M. A.
ప్రిన్సిపాల్

—"GEMINI"

సారి పేరు వినగానే అందరూ వికవికలు మానేసి, తమలో తాము ఏదో చర్చించుకో సాగారు.

"సారీ వాళ్ళు ఇప్పు డెక్కడుంటున్నారు?" అని అహీన్ అడిగాడు.

"దాని పేరెత్తకండి, రాంగబాబూ. అది పాపం చేసింది. మొగుణ్ణి విడిచిపెట్టి, ఆ దొర దగ్గర ఉంటున్నది," అన్నదొకతె.

అహీన్ చకితుడై, "దొర ఎవరు?" అన్నాడు.

"ఆ మిల్లు పెట్టించినాయనే."

"ఆ దొరను ఇక్కడ మిల్లెందుకు పెట్టనిచ్చారు తమరు? ఆ పిల్లను పట్టి బలవంతాన లోబరచుకున్నాడు. ఆయనంటే భయం కొద్దీ ఎవరూ నోరెత్తలా!" అన్నది ఒకముసలిది. "మా భూములన్నీ లాక్కున్నారు. మేమంతా డబ్బుబాకీ అన్నాడు. దావా వేస్తానన్నాడు."

ఎలాటి దురన్యాయం జరిగిపోయిందో ఆమె మాటలనుబట్టి అహీన్ కొంచెం కొంచెమే అర్థంచేసుకో సాగాడు. అతనికి తలలో రక్తపుపోటు వస్తున్నది. అతనికి అంతకోపం ఎన్నడూ రాలేదు. రక్తం వేడెక్కి ఈదురుగాలికికూడా చలి పుట్టటంలేదు.

అతను కాళిందీనది దగ్గిరికి వచ్చి, ముఖం కడుక్కొని, ఇన్ని నీళ్ళు నెత్తిన పోసుకున్నాడు. మిల్లు యజమాని చేసినది ఒక అత్యాచారం కాదు. ఒక అమాయిక స్త్రీని బలాత్కరించి ఆమె కాపరం తీశాడు. వాళ్ళజాతిని కళంకపరిచి, వాళ్ళ భూములు లాగేసుకున్నాడు. ఈ సాంతాలీలు తమ వంశాన్ని మూడు తరాలుగా ఆరాధిస్తున్న వాళ్ళు, వాళ్ళు తన ప్రజలే. కేవలం మానవుడుగాకూడా అన్యాయాన్ని ప్రతిఘటించడం తనధర్మం. అంతకుమించిన మానవధర్మంలేదు. తన అన్న శిక్షపడితే సహించగలిగిన తనతల్లి, ననీపాల్ చావుకు కంట తడిపెట్టింది.

అతను, ఇంకా నిలిచివున్న వట్టివేళ్ళ పొదలపక్కగా నడుస్తుండగా, వాటి వెనకనుంచి సారి వచ్చి, "రాంగాబాబూ!" అని పిలిచింది. ఆమె చేతిలో రెండు ఎర్రగులాబీ లున్నాయి. వాటిని ఆమె అతనికేసి చాచింది.

"మనుషుల ఎదట పడటానికి నీకు సిగ్గులేదూ? పో అవతలికి" అని అహీన్ ఆమెను కసిరాడు.

"ఇంతపెద్ద బాకుచూపించి భయపెట్టాడు, బాబూ. కమ్చీతో వీపంతా బాదాడు!" అన్నది సారి భయంతోనూ, ఆగని కన్నీటితోనూ,

"వెళ్ళు, వెళ్ళు! పో ఇక్కణ్ణుంచి," అన్నాడతను తీవ్రంగా.

సారి పొదలమధ్యగా మాయమయింది.

అహీన్ దీర్ఘంగా నిట్టూర్చి, మళ్ళీ నీళ్ళదగ్గిరికి వెళ్ళి, కాళ్ళూ, ముఖమూ కడుక్కొని అక్కడే కూర్చునిపోయాడు. కొంచెంసేపటికి అమల్ వచ్చాడు. అహీన్ అతనితో మిల్లు యజమాని చేసిన


Hearty Deepavali Greetings

Please Visit:

HEAD OFFICE

Ashok DRESSES
Sultan Bazar

HYDERABAD

BRANCH OFFICE

Dress Centre
Sultan Bazar

Manufacturers of:
QUALITY
FANCY
GARMENTS

Mandal APPARELS
STATION ROAD, HYDERABAD—A. P.
Phone: 46407

Stockists:
WOOLLEN
HOSIERIES
HANDLOOM
&
BANIANS

Phone: 43077

Residence Phone: 45005

అక్రమాలూ, దానికి తాను దుర్భరమైన ఆగ్రహానికి గురికావటమూ చెప్పి, "దీనికి ప్రతిక్రియ చేసి తీరాలి," అన్నాడు.

"మా నాన్నగారితో చెబుదాం. ఆయనకూ్కడా ఆ మిల్లు దొర మీద చాలా కోపంగాఉంది. మిల్లువాళ్ళు పంపుపెట్టి నదినుంచి నీరు తోడుతున్నారు. దాన్ని గురించి క్రిమినల్ కేసుకూడా అయేట్టుంది," అన్నాడు అమల్.

"ఒకరు మిల్లుదారూ, ఇంకొకరు జమీందారూ, వాళ్ళకు తేడా ఏముంది? మానవుడు సాటి మానవుడి కష్టాలు తీర్చాలి. డబ్బు మాటకు కాదు," అన్నాడు అహీన్.

అమల్ నిర్ఘాంతపోయాడు

*　　　　*　　　　*

ఉమపెళ్ళి వైశాఖమాసంలో జరుపుదా మనుకున్నాడు ఇంద్ర రాయ్. ఎంచేతంటే ఫాల్గుణ చైత్రాలు జమీందార్లకి రద్దీకాలం. సంవత్సరాంతం, లెక్కలు తేల్చాలి. బాకీలు వసూలుచేయాలి. అవన్నీ అయాక పెళ్ళి విషయం చూదామనుకున్నాడు, కాని పెళ్ళి ఫాల్గుణంలోనే జరగాలని హేమాంగిని పట్టుబట్టింది. కారణమేమంటే, కోపోద్రేకంతో అహీన్ తలనొప్పి తెచ్చుకుని ఇంటికి వచ్చినవాడు, అమల్ద్వారా ఆ సంగతి తెలిసి హేమాంగిని తన పిల్లలను వెంటబెట్టుకుని అతన్ని చూడబోయింది; అప్పుడు ఉమను చూడగానే అహీన్ తేరుకున్నాడు; అదిచూసి సునీతి, పెళ్ళివెంటనే చేస్తే తనకొడుక్కు మంచిదన్నది; హేమాంగిని ఇంటికివచ్చి భర్తతో, "ఫాల్గుణంలోనే ఈ పెళ్ళి జరగాలి," అన్నది.

రాయ్ చెప్పి చూశాడు. హేమాంగిని వినిపించుకోలేదు. ఆమె తన తొందరకు కారణం చెప్పక, వైశాఖమాసం ఎండలనీ, అకాల భోజనాలవుతాయనీ, ఏదేదో అన్నది. చివరకు, "పెళ్ళికొడుకు తల్లి కోరుతున్నది. వాళ్ళ ఇష్టమా, మనఇష్టమా?" అని అడిగింది.

రాయ్ నవ్వుతూ పంచాగం తీసి ఫాల్గుణ శుద్ధంలోనే ముహూర్తం పెట్టాడు. వివాహ ప్రయత్నాలు భారీగాచేశాడు. ఊళ్ళో అందరినీ ఆహ్వానించాడు,

మగ పెళ్ళివారి తరపున సాంతాలీలకు ఆహ్వానం వెళ్ళింది. కాని వాళ్ళెవరూ రాలేదు. వాళ్ళను వెళ్ళవద్దని కట్టడి చేశారనీ, వెళితే జరిమానాలు వేస్తామని భయపెట్టారనీ అచింత్యబాబు వచ్చి చెప్పాడు.

ఈసంగతి తెలిసి అహీన్ చాలా నొచ్చుకున్నాడు. ఇంద్రరాయ్ ఈమాటవిని తోకతొక్కిన తాచల్లే లేచాడు.

"ఇవాళ మీరేమీ చెయ్యటానికిలేదు. ఇవాళ మన ఉమపెళ్ళి." అని హేమాంగిని అతన్ని హెచ్చరించింది.

పెళ్ళి అయిన మర్నాడు జరిగేవిందుకు సాంతాలీ లందర్నీ పిలిపించాడు.

"పెళ్ళినాడే వాళ్ళని రానివ్వనివాళ్లు ఆ సాంతాలీలను ఇవాళ




దీపావళి శుభాకాంక్షలు!

సిండికేట్ బ్యాంకు డైరెక్టర్లు, సిబ్బంది; తమ గౌరవనీయులైన కాతాదారులకు, శ్రేయోభిలాషులకు దీపావళి శుభాభినందనములు అందజేస్తున్నారు.

FAITHFUL SB FRIENDLY

సిండికేట్ బ్యాంక్ లిమిటెడ్

రిజిష్టర్డు ఆఫీస్ : మణిపాల్, మైసూర్ రాష్ట్రం

| | | |
|---|---|---|
| మొత్తం వాటాధనం | మొత్తం బ్రాంచీలు | టి. ఎ. పాయ్ |
| రు. 100 కోట్లకు పైబడి | 240 కి పైగా | చైర్మెన్ |

—"NALIN"

రానిస్తారా? మీరీపనిచేసి, పాపం, వాళ్ళను ఇరుకునపెట్టకండి. రాజులూ రాజులూ లడాయిచేస్తే మధ్య నలిగిచచ్చేది అల్ప ప్రాణులు," అన్నది హేమాంగిని.

సునీతికూడా అతన్ని పంతాలకుపోయి తగాదా లేవతీయ వద్దన్నది.

"అల్ప ప్రాణులు పుట్టేది మధ్యతరగతి చావటానికే. ఇది చక్రవర్తి, రాయ్‌వంశ ప్రతిష్ఠలకు సంబంధించిన విషయం. మీరేమీ అడ్డుచెప్పవద్దు, అన్నాడు రాయ్.

అతను సాంతాలీలతోబాటు విమలబాబునూ, లంకలో ఉన్న యావన్మందినీ ఆహ్వానించాడు.

రాయ్‌గారి మనిషి వచ్చి ఆహ్వానిస్తే సాంతాలీలు మ్రాన్పడిపోయారు. చూడా ఏమీ చెప్పలేకపోయాడు. వెనకగొయ్యీ ముందు నుయ్యీనూ. ఏమయినా వాళ్ళు విందుకు రానేలేదు. పైపెచ్చు, ఆ సాయంకాలం లంకలో ఉత్సవం చెలరేగింది. వాళ్ళకు తాగినంతసారా, రెండుపందులూ విమలబాబునుంచి ముట్టాయి. ఇప్పటికీ వాళ్ళు తటపటాయించి, "రాంగాబాబుగారేమంటారో!" "అనుకున్నారు. కాని చివరకు "దొరగారి" మాటే విననిశ్చయించుకున్నారు. డోళ్ళూ డప్పులూ వాయిస్తూ, పాడుతూ, ఆడుతూ. తాగినమజాలో సంబరంచేసుకున్నారు.

ఒక చెంపవిందు జరుగుతున్నా సాంతాలీల డప్పులమోత చెవినిపడి ఇంద్రారాయ్ సంగతి గ్రహించాడు. అతను రామేశ్వరుడి గదికి వెళ్ళాడు. కిటికీవద్ద నిలబడి రామేశ్వరుడు లంకకేసి చూస్తున్నాడు. రాయ్‌పిలుపుకు వెనక్కుతిరిగి, "ఎవరూ? రా, ఇంద్రా! భోజనాలు పూర్తి అయాయీ?" అన్నాడు.

"అయాయి, వంటవాళ్ళూ, వడ్డనల వాళ్ళూ భోంచేస్తున్నారు."

రామేశ్వరుడు ఉమని పిలిచి, "మీ నాన్నకు వడ్డించు–ఈ గదిలో కాదు, ఇంకోగదిలో." అంటూ తన చేతులు చూసుకున్నాడు.

"ఇప్పుడు భోంచెయ్యనులే, మనుమణ్ణి రానీ, వాణ్ణి ఒళ్ళో కూర్చోబెట్టుకుని భోంచెస్తాను." అన్నాడురాయ్.

"నువు మనవణ్ణి ఒళ్ళో కూర్చోబెట్టుకుని భోంచేసినవాడు ఈ ఇంటికి కళవస్తుంది." అన్నాడు రామేశ్వరుడు.

ఉమ సిగ్గుపడి పోయింది, తండ్రి హెచ్చరించిన మీదట ఆమె తన అత్తగారి భోజనం గురించి విచారించటానికి అక్కడినుంచి బయలుదేరింది.

సునీతి బయటి వరండాల కట కటాకు తల ఆనించి నిలబడి మహేన్ గురించి విచారిస్తున్నది. ఇవాళ తమ ఇంటికి మహేన్ వధువు మెట్టి ఉండవలసింది... ఇవాళ నవీన్ సుష్టుగా భోంచేసి బొజ్జ నిమురుకొనవలిసింది...నవీన్ చేత దెబ్బతిని చచ్చిన ముసల్మాను వాడు వచ్చి పిండి వంటలు తిని ఉండవలిసింది.

ఆమె తలఎత్తి లంకకేసి చూసింది–సర్వానర్థాలకూ మూల కారణమైన లంక?...ఇవాళకూడా సాంతాలీలు భోజనాలకు రాలేదు. మిల్లు యజమానీ రాలేదు. రాయ్ అన్నగారి ముఖం కంద గడ్డలాగున్నది... రానివాళ్లు కర్ణకఠోరంగా ఆ డప్పులూ, డోళ్ళూ వాయించటమేమిటి? మళ్ళీ ఏం విపత్తు రానున్నదో? లంకయుద్ధం ప్రకటిస్తున్నదా?... ఏమయినా సరే, అహీన్ యీ కొట్లాటల్లోకి దిగటానికి వీల్లేదు. తాను అడ్డుపడుతుంది. రాయ్‌గారి కాళ్ళు పట్టుకుంటుంది...

ఉమవచ్చి, "భోజనానికి రండి, అత్తయ్యా." అని, అందులో తన గృహిణీత్వం ఉన్నదని లజ్జపడి," అమ్మ మిమ్మల్ని పిలుస్తున్నది," అన్నది.

"అహీన్ ఎక్కడమ్మా?" అని సునీతి అడిగింది. ఉమ జవాబు చెప్పటానికి సిగ్గుపడింది.

అహీన్ తను చదువుకునేగదిలో, కారల్ మార్క్స్ "కాపిటల్" ముందు పెట్టుకుని మానదాచేత మాటలు పడుతున్నాడు.

"ఇదేంపని? ఇవాళ పూలపాన్పురోజు పదిమంది ముత్తయిదువులు వచ్చారు. పాటలు పాడుతారు. పరాచికా లాడుతారు. మీరిక్కడ ఈ లావుపుస్తకంలో తల దూర్చట మేమిటీ?" అని మానదా మందలిస్తున్నది.

సునీతి వచ్చి, మానదాను పంపేసింది. అహీన్ పుస్తకంలో గుర్తుపెట్టి మూసివేస్తూ, "పుస్తకం చాలా బాగుందమ్మా! చదువుతుంటే ఆపబుద్ధికాలేదు," అన్నాడు. సునీతి అదేం పుస్తకమని అన్నది.

"ఒక గొప్పవ్యక్తి రాసిన పుస్తకమమ్మా. ఋషిలాంటివాడు, ప్రపంచంలో అసంఖ్యాకులు దరిద్రులుగా ఉండటానికీ. కొద్దిమంది ధనికులుగా ఉండి, విలాసాలకోసమూ, ఐశ్వర్యంకోసమూ, రాజ్యాలకోసమూ క్రూర మృగాల్లాగా తయారు కావటమూ, మనుష్యుల మధ్య సంఘర్షణలో రావటానికీ మూల కారణమేమిటో నిర్ధారణ చేసి చెప్పాడు, దీనికి నివారణోపాయం కూడా చెప్పాడు," అన్నాడు అహీన్.

"అయితే ఆ ఉపాయాలు అమలు చెయ్యకూడదా, అహీన్?"

అహీన్ నవ్వి, "జమీందార్లూ, ధనికులూ అమలు జరగనిస్తారా, అమ్మా? మనమూ, ఆ విమలబాబూ ఆ మార్గాన్ని అవలంబిస్తే ఏ సమస్యా ఉండదు. ఆస్తికోసం కొట్లాడేది మనమే, మనమే అమాయక ప్రజలను పేదవాళ్ళగా చేసింది. ఈ లంకభూములను గురించి సరిగా ఆలోచిస్తే నీకేతెలుస్తుంది. ఇదివరకున్న భూమి కూడా కాదు, కొత్తగా ఏర్పడినది," అన్నాడు.

"ఆ లంక భూములు మనకువద్దు, నాయనా. వాటిని అమ్మెయ్యమని మీ మామగారితో చెప్పు," అన్నది సునీతి.

"ఎందుకమ్మా అలా భయపడతావూ?"

"న్వు కొట్లాటల్లోకి వెళ్ళకు. మీ వంశంవాళ్ళ ఆగ్రహం మహా చెడ్డది. మహేన్‌గతి ఏమయిందో చూడు."

ఆమె అతన్ని తన భర్తగదికి తీసుకుపోయింది. అక్కడ రామేశ్వరుడూ, ఇంద్రరాయీ లంక గురించే మాట్లాడుకుంటున్నారు.

అహీన్‌కు తనతండ్రి స్వరూపం భయానకంగా తోచింది.

"అమావాస్యనాడు వాణ్ణి సర్వ రక్షాదేవికి బలియిస్తే ?" అంటున్నాడు రామేశ్వరుడు.

"ఆ రోజులు పోయాయి. రామేశ్వర్. చట్టబద్ధంగా పోరాడాలసిందే. మన సొంతభూములను సాంతాలీలు చేసుకోవటానికిచ్చాం. వాటిని తీసేసుకుని సాంతాలీలకు గుణపాఠం నేర్పాలి. మిల్లు యజమాని నదిలోకి కట్టవేసి పంపింగ్ మిషనుపెట్టాడు. ఆకట్ట తీసెయ్యాలి. అక్కడే కొట్లాట జరగొచ్చు." అన్నాడు రాయ్.

"ఆ లంకను అమ్మేద్దా మంటున్నది అమ్మ." అన్నాడు అహీన్.

"వీల్లేదు !" అని రామేశ్వరుడు ఉరిమాడు. ఆయనలో చిత్రమైన మార్పు వచ్చేసింది.

* * * *

మర్నాడు ఉదయమే జమీందారు తరఫువాళ్ళు లంకమీదికి ఆక్రమణకోసం వచ్చారు. బలగం పిలవకుండానే హాజరయింది, రైతులందరూ తమ ఎద్దులనూ, నాగళ్ళనూ వెంటపెట్టు కొచ్చారు. అందరికంటె ముందున్నాడు రంగ్‌లాల్. బాగ్దీలంతా వచ్చారు. ఇంద్రరాయ్ కిందఉన్న పహిల్వానులు వచ్చారు. సాంతాలీలు సాగులోకి తెచ్చిన జమీందారు భూమిలోకి జొరబడ్డారు.

సాంతాలీలు కలగజేసుకోలేదు. వాళ్లు తమ పల్లెచివరచేరి జనాన్ని విచారంగా చూస్తూ ఉండిపోయారు. సాంతాలీ స్త్రీలు మాత్రం నెత్తి నోరూ బాదుకుంటూ ఏడ్చారు. కొందరు తమ మగవాళ్ళను నానాతిట్లూ తిట్టారు: "రాంగాబాబుతో విరోధం తెచ్చుకుంటే ఇంతకన్న ఏమవుతుంది ? ఇక తిండికిమాడు చావాల్సిందే. ఆటు భూముల్ని దొరకాజేశాడు. రాంగాబాబు ఇచ్చిన కౌళ్ళు రద్దుచేశాడు !"

ప్రతిఘటన ఏమీ లేకపోయేసరికి బాగ్దీలు మరింత వీరావేశంతో కర్రలుతిప్పి, చిందులు తొక్కారు.

రెండు దివాణాల మేనేజర్లువచ్చి. "కాళిందిలో వేసిన అడ్డకట్ట తెగగొట్టండి. గొట్టాలు పీకెయ్యండి." అని ఆవేశంతో మనుషులకు ఆదేశాన్నిచ్చారు. జమీందార్ల మనుషులు కట్ట తెగొట్టి, గొట్టాలు పీకిపారేస్తూంటే, మిల్లు కూలీలు అంతదూరాన నిలడి చూస్తూఉండి పోయారుగాని అడ్డంరాలేదు. వాళ్ళకి దూరంగా సారి నిలబడిఉన్నది. ఆమెను దొర వెళ్ళగొట్టాడు, అతగాడి మోజు తీరి


మా దీపావళి

శుభాభినందనలు

యువ ప్రోసెస్

లైన్, హాఫ్‌టోన్ & మల్టీకలర్ బ్లాక్ మేకర్స్

పబ్లిక్‌గార్డెన్ రోడ్, హైదరాబాద్ - 1

ఫోన్ : 34400

పోయింది. శూలపాణి అనేరాయ్ వంశస్థుడు, కూలీల హాజరు పట్టీలు వేసేవాడు, ఆమెనిప్పుడు సాకుతున్నాడు.

ఇలా జరగబోతుందని ముందే తెలిసికూడా విమలబాబు చూస్తూ ఊరుకున్నాడు. అతని దగ్గిరకూడా వస్తాదులున్నారు, తుపాకు లున్నాయి...

ఎంతో కాలానికి చక్రవర్తుల కచేరీసావిడి సందడిగా ఉన్నది. రైతులూ, బాగ్దీలూ చేరారు. ఆపూట స్వాధీన పరుచుకున్న భూమిని రైతులకిస్తూ కవుళ్ళు తయారవుతున్నాయి.

రాయ్ మనసుకూడా కుదుటపడింది. అతను మరోతగాదాకు మార్గం ఆలోచిస్తున్నాడు. అచింత్యబాబు ఎవరినో వెంటతీసుకుని వీధిగుండా పోతూ, "సీరియస్ చార్జెస్ - రయిటింగ్ అండ్ ట్రెస్ పాస్, ఇంకా ఏమేమిటో మాంఛి లాయర్లను ఎంగేజ్ చేశారు. ఇప్పుడే లారీలో బయలుదేరారు చార్జీలు పెట్టటానికి," అని చెప్పటం రాయ్ చెవినిపడింది.

రాయ్ చట్టున తన మేనేజరు మైత్రాను కేకేసి. "టవునుకు వెళ్ళే దారిలో ఊరుదాటినాక వంతెన ఉందిచూడూ —" అని ఆరంభిం చాడు.

"దాన్ని సగం పడగొట్టేస్తేపని తీరిపోతుంది. గునపాలిచ్చి మనుషులను పంపుతాను, అరగంటలో పని పూర్తి అవుతుంది," అన్నాడు యజమాని అంతస్సు తెలిసినమైత్రా.

"టవునుకు మంచి వ్యవహర్తను పంపి. ముఖర్జీ, సేన్, సింహాలకు బయానాలిప్పించు. వాళ్ళను మించిన క్రిమినల్ లాయర్లు లేరు. మనమేముందు ప్లేంట్ పడెయ్యాలి," అన్నాడు రాయ్.

ఈరోజు కూడా మరొక పెళ్ళి విందున్నది — పెళ్ళి పెత్తనాలు చేసిన వాళ్ళకూ. నౌకర్లకూ, చాలా దగ్గిరవాళ్ళకూ ఈవిందు, దొమ్మీ చేసినవాళ్ళకూడా ఈవిందుకు పిలవబడ్డారు. మానదా ఆడావుడి ఏమీ తగ్గలేదు. హేమాంగిని పెత్తనం చేస్తున్నది. సునీతి మాత్రం లంకలో రక్తం ఏళ్లుగట్టి పారటం ఊహించుకుని కుంగి పోతూ స్తబ్ధుగా ఉండిపోయింది. చచ్చిపోయినవాళ్ళ శవాలు ఆమెకు కనిపిస్తునాయి. కొట్టాట ఏమీ జరగలేదని తెలిశాక ఆమె ముఖం వికసించింది.

వంతెన పడగొట్టే పనిమీద మైత్రాను వియోగించి రాయ్ గట్టిగా అరుచుకుంటూ రామేశ్వరుడి వద్దకువెళ్ళి, "క్రిమినల్ కేసులు పెడ తాట్ట మనమీద మిల్లుయజమాని!" అంటూ పెద్దగా నవ్వాడు.

కింద మిఠాయిలు తీసుకోవచ్చిన బాగ్దీలు గొడవచేస్తున్నారు.

"ఆ మజుందారు కాలు విరగ్గొట్టో, పళ్ళురాలగొట్టో వస్తే నేను సంతోషించేదాన్ని," అంటున్నది వాళ్ళతో.

రాయ్ రామేశ్వరుడి గదిలోనుంచివస్తూ ఉమను కేకేశాడు. రామేశ్వరుడికి కావలసిన పనులుచెయ్యటానికి ఆమెను వియోగిద్దా మని అతనిఉద్దేశం. కాని ఉమ చాలా అలిసినట్లు కనిపించింది. ఆమెముఖం పాలిపోయున్నది. అదంతా పూలపాన్పు అలసట అనుకుని రాయ్, "మీ అత్తగారినిపిలిచి, మీ మామగారి స్నాన పానాలు చూడమనమ్మా!" అన్నాడు.

హేమాంగినికూడా ఉమనుచూసి, తనభర్త అనుకున్నట్టే అను కున్నది. కాని నిజంగా జరిగినదివేరు, ఆరాత్రి ఉమకు భర్త కని పించలేదు సరికదా, పూర్వపు అహీన్ కూడా కనిపించలేదు. అతను స్తబ్ధుడుగానూ, ఉదాసీనుడుగానూ అయిపోయి, తన ఎదటికివచ్చిన ఉమను గుర్తించనుకూడా లేనివాడులాగా కనబడ్డాడు. తెల్లవారాక కూడా ఆయన వరండాలో పచార్లు చేస్తున్నాడు.

వరుడి ఇంటివద్ద జరగవలసినవి పూర్తిఅయాక వధూవరులు రాయ్ఇంటికి వచ్చారు. అక్కడ జరగవలసిన తంతుకూడా ఉన్నది.

అమల్ణి తండ్రి బస్తీకిపంపి మేస్రీటును కలుసుకోమన్నాడు. అమల్ చక్రవర్తుల తరపునవెళ్ళి, మిల్లుయజమాని జబర్దస్తీగా నదికి అడ్డకట్టవేసి పంపుతో నీరు తోడేసుకుంటున్నాడనీ, అందు వల్ల పేదరైతుల పొలాలకు నీరెక్కక తీరనినష్టం కలుగుతోం దనీ చెప్పాడు. ఈపని అహీన్ద్వారా జరిగి ఉండవలసింది కాని కొత్తపెళ్ళికొడుకు అప్పుడే ఇల్లు కదలటానికిలేదు.

ఇంద్రరాయ్ అల్లుణ్ణి కూర్చోబెట్టి సంగతి సందర్భాలన్నీ అత నికి వివరంగా చెబుతున్నాడు. ఫలహారం తీసుకువచ్చిన హేమాం గిని, "జమీందారీ, కొట్టాటలూ, దావాలూ - ఇవితప్ప మాట్లాడు కునేటందు కింకేమీ లేవా మీకు?" అని అడిగింది.

"జమీందారుబిడ్డ జమీందారీ నిర్వహించవద్దా? అక్బరుపాదుషా పన్నెండోఏట పాదుషాగిరీ నిర్వహించాడు," అన్నాడు రాయ్.

ఆ సాయంకాలం అహీన్ అలా తిరిగి వద్దామని షికారుకు బయలు దేరాడు. అతను వెళ్ళాక అమల్ టవున్నుంచి తిరిగి వచ్చాడు. అతను ఉమకు ఒక సాంతాలీ చీరె తెచ్చాడు. మూడు రోజులుగా మనసు బరువుగా ఉంటున్న ఉమకు కాస్త ఉత్సాహం వచ్చింది. ఆమె ఆ సాంతాలీ చీరె ధరించి అన్న ఎదటికి వచ్చింది.

ఆమెచేత జుట్టు ఎగదువ్వించి సాంతాలీకొప్పు పెట్టింది. అందులో బంతిపూలు తురిమించి, అమల్ ఆమెకు ఫోటో తీశాడు. తరవాత అతను అహీన్ను వెతుక్కుంటూ కాళిందీ తీరానికి వెళ్ళాడు. అక్కడ కూర్చుని అహీన్ లంకకేసి చూస్తూ. దీర్ఘాలోచనలో మునిగి ఉన్నాడు.

"ఏర్పాట్లన్నీ చేసి వచ్చాను. నే చెప్పినదంతా కలెక్టరు శ్రద్ధగా విన్నాడు. ఎంక్వాయిరీ కూడా జరుగుతుంది. ఆ సారి సంగతి కూడా కలెక్టరుతో చెప్పాను." అన్నాడు అమల్ అహీన్ పక్కనే కూర్చుని, విమలబాబును స్కౌండ్రల్ అని తిడుతూ.

అహీన్ నవ్వుతూ, "అతనిమీద నీ కంత కోపం దేనికి; అతను చేసిన అపచారాలు కొత్తవి కావు. అనాదిగా శక్తిమంతులు బలహీ నుల్ని అన్యాయం చేస్తూనే ఉన్నారు. చక్రవర్తులూ, పాదుషాలూ,

మహారాజులూ, జమీందార్లూ — అందరూ ఈ పన్లే చేశారు. మనం మటుకు అవకాశం దొరికితే అలా చెయ్యమని ఏమిటి?" అన్నాడు

"వాట్ డూ యూ మీన్?". అన్నాడు అమల్ క్రుద్ధుడై.

"సాంతాలీలు మోసపోవటం తప్పనిసరి. సారికి అదుర్దాకూడా తప్పనిసరే. ఆలోచించుకో."

చీకటిపడే వేళకు వాళ్ళు ఇంటికేసి బయలుదేరారు...

ఉమ ఫోటోకోసం ధరించిన సాంతాలీ యువతి వేషం విప్పెయ్యనే లేదు. తల్లి చీవాట్లు పెట్టి, లాభంలేక ఊరుకున్నది. అహీం ద్రుడూ; అమలుడూవచ్చేసరికిఆమె అదేఅవతారంలో డ్రెసింగ్ టేబిల్ దగ్గిర నిలబడి ఉండి, అద్దంలో వాళ్ళిద్దరినీ చూసి తొట్రుపడింది. ఆమె చీరె చెంగునెత్తి మీదికి లాక్కోవాలని ప్రయత్నించింది గాని, సాంతాలీ చీరె చెంగునెత్తి మీదికి లాక్కునేటంత విడివిగా ఉండదు.

అహీన్ ఉమను ఈ అవతారంలో ఎంతో ఆసక్తిగా చూసి, కూర్చో. ఉమా. సాంతాలీలు చీరె నెత్తిమీదికి లాక్కోరు. నేను చూపిస్తానుండు." అంటూ ఎర్రగళ్ళ రుమాలొకటి తెచ్చి ఆమె తలకు కట్టి, "ఇలా వేసుకుంటారు." అన్నాడు.

"కాస్త ఆగండి. నేను టీ యేర్పాటు చేయించివస్తాను. తరవాత ఉమ చేత సాంతాలీ నృత్యం చేయిద్దాం." అంటూ అమల్ జారుకున్నాడు.

ఉమ తలవంచుకుని ఏడుస్తున్నట్టు గ్రహించి అహీన్ ఆశ్చర్యపోతూ, ఆమె గడ్డంపట్టుకుని తల పైకెత్తాడు.

"ఏడుస్తున్నావా? ఏంజరిగింది?" అని అతను అడిగాడు.

ఉమ అతనిచేతిని తోసేసి, అతని రొమ్ముమీద తలపెట్టుకుని వెక్కివెక్కి ఏడవసాగింది. ఆమె దుఃఖానికి కారణం తన అలక్ష్యమేనని అతనికి అర్థమయింది. అతను ఆమెముఖాన్ని తన రెండుచేతుల్లోకి తీసుకుని, ముద్దులమీద ముద్దులు పెట్టుకుని, ఆమెకు ఊపిరాడకుండా చేశాడు.

ఆరాత్రి వాళ్ళిద్దరూ నిద్రపోలేదు.

తెల్లవారుఝామున వాళ్ళకు సాంతాలీలు కనిపించారు. వాళ్ళు స్త్రీలతోనూ, పిల్లలతోనూసహా, పశువులమీద కర్రసామగ్రి వేసుకుని తరలి వెళ్ళిపోతున్నారు. కొన్ని ఎద్దుబళ్ళుకూడా ఉన్నాయి. చాలామంది నెత్తిన బరువులున్నాయి. వాళ్ళు వెళ్ళిపోతున్నారు.

వీళ్ళు దొరతో లాలూచీకాలేక వెళ్ళిపోతున్నారనీ అహీన్ తెలుసుకున్నాడు.

*　*　*

మిల్లుయజమానికీ, జమీందర్లకూమధ్య దావాలు నడిచాయి. కాని అధికార్లకు విమలబాబు చేసినపనుల్లో ఒక తప్పూ కనిపించలేదు. సాంతాలీలు తమపొలాలను అతనికి బుద్ధిపూర్వకంగా విక్రయించారు. వెళ్ళిపోగా మిగిలిఉన్న చూడామాఝీ మొదలైనవాళ్ళు

Phone: 74386
Resi: 74383

Grams: 'FANCYPAPER'

*With best compliments*

*from :*

**GOLI ESWARAIAH**

**GENERAL BAZAR, SECUNDERABAD – A. P.**

*Distributors & Stockists :*

The Titagarh Paper Mills., Co., Ltd.
Straw Products Ltd., Bhopal.

Ballarpur Paper & Straw Board Mills Ltd.,
Seshasayee Paper & Straw Board Ltd.
Hoogly Ink Co., Ltd.

అమాశుచెప్పారు. సారి ఆటవికస్త్రీలకు సహజమైన దురాశకు పోయింది - అంతకంటె ఏమీలేదు. పైపెచ్చు విమలబాబు సజ్జనుడు. మిల్లుపెట్టి ఆ ప్రాంతానికి గొప్పఐశ్వర్యం చేకూర్చాడు. పదిమందికి బతుకుతెరువు కలిగించాడు. చెరుకుపంట వృద్ధి అవుతున్నది. చక్కనిరోడ్లు ఏర్పడ్డాయి.

అయితే ఈకాష్ఠం ఇంతతో చల్లారలేదు. ఇంద్రరాయ్ పగపట్టి, మీసాలు మరింత మెలితిప్పి, కొత్తతగాదాలకు దోహదం ప్రారంభించాడు.

అహీన్ కలకత్తాలో ఉండి చదువుతున్నాడు. అతను ఎప్పే పాసై బియ్యేలోచేరి చదువుతున్నాడు. శలవులకు అమల్ ఇంటికివచ్చినప్పు డతనివెంట రావటంలేదు. వాళ్ళిద్దరూ అంతగా కలుసుకోవటం లేదు. అహీన్ కొత్తరకం వ్యక్తులతో తిరుగుతున్నాడు. అతని ప్రవర్తన పూర్వంలాగా మార్దవంగాలేదు. అని అమల్ తనతల్లికి చెప్పాడు.

తన అల్లుడిలా మారటంవిని హేమాంగిని కంగారుపడింది. కాని తనభర్త ఆలోచనాధోరణిని పూర్తిగా అర్థంచేసుకున్న ఉమ ఏమాత్రమూ చలించలేదు ఉమకు భర్తఅంటే చాలా గౌరవం ఉన్నదనితెలిసి హేమాంగిని తృప్తిపడింది

కాని దేవిపూజకిచ్చిన శలవులకు వచ్చినప్పుడు అహీన్ చిక్కిపోయి, జుట్టురేగి, చూడటానికి భయం వేసేటట్టున్నాడు. అతను తన శరీరంగురించీ, ఆరోగ్యంగురించీ ఏమీ శ్రద్ధ తీసుకుంటునట్టు లేడు. అతన్నిగురించి శ్రద్ధతీసుకోమని ఉమకు తల్లి బోధచేసింది.

ఒకనాడు అహీన్ మిద్దెమీద చీకట్లో కూచునిఉండగా సునీతి వచ్చి దగ్గరకూచుని, "అంతకంతకూ మాకు ఎడమైపోతున్నావేం, నాయనా? కొత్తగా భార్యవచ్చిన వాడివిగదా, ఆకర్షణ అటు నుంచేమో ననుకున్నానుగాని, అదీ కాదల్లే ఉంది," అన్నది.

"నే నీమధ్య ఆలోచించటం జాస్తి అయిందిలే. కాని నేను మీకు దూరంమటుకు కాలేదు. అదంతా నీభ్రమ," అన్నాడుఅహీన్.

"ఏమిటిరా అంత ఆలోచనా?"

"ఏమీలేదమ్మా. మనుషులు మనుషులకు చేసే అన్యాయాలను గురించే ఆలోచిస్తుంటాను."

ఇంతలో మానదాపైకి వచ్చి, రాయ్ ఇంటివాళ్ళు వచ్చారని చెప్పింది. తల్లి కొడుకులు కిందికి దిగి వచ్చారు.

జమీందారు కుటుంబాల పరవు నిలబెట్టటానికి రాయ్ ఒక దావా తలపెట్టాడు. కాని డబ్బు కావాలి అప్పుతేవచ్చుగాని, జుట్టు అప్పులవాళ్ళ చేతికిచిక్కి తీరనినష్టం కలుగుతుంది. డివాణం సొంత


Superior

Printing Inks

For

All

Process

Of

Printing

**COATES OF INDIA LIMITED**

33, Sheik Maistry Street Royapuram,

MADRAS-13.

*Also at: * CALCUTTA * BOMBAY * DELHI*

భూములను సాలుకిచ్చి డబ్బు పుట్టిందామని ఇంద్రరాయ్ ఆలోచన. అందుకు రామేశ్వరుడు సరే నన్నాడు. ఉమ కాపరానికి వచ్చి నాక ఆయన కాస్త మెరుగైనట్టు కనిపిస్తున్నాడు. ఇద్దరూ కలిసి రోజూ కావ్యపఠనం చేస్తారు.

ఇది చాలా రహస్యంగా అనుకున్నమాటే అయినప్పటికీ, మర్నాటికల్లా రంగ్‌లాల్ మొదలైన రైతులు వచ్చిపడి, బిఘాకు ముప్ఫైరూపాయలు కానుకగానూ, రెండేసి రూపాయలు శిస్తుగానూ ఇచ్చుకుంటా మన్నారు.

రాయ్ అనుమానంగా, "అంతడబ్బు మీ కెక్కడిది?" అని అడిగాడు.

రంగ్‌లాల్, రాయ్ కాళ్ళుకట్టుకుని, "ఎక్కడో తలానూరూ ముష్టెత్తుతాం. ముప్ఫయిమందిమి. మాకా పొలం దయచేయిం చండి," అని ప్రాధేయపడ్డాడు.

ఇంతడబ్బు మరే విధంగానూ పుట్టదని రాయ్ గ్రహించాడు.

మూడునెల్లు గడిచాయి. రైతులు సాలుకుతీసుకున్న భూములను అకస్మాత్తుగా మిల్లు యజమాని స్వాధీనపరుచుకున్నాడు. అందులో లంకభూమికూడా ఉన్నది ట్రాక్టరువచ్చి లంకభూములన్నిటినీ కలయదున్నేసి ఏకంచేసింది. రాయ్‌హాట్ ప్రజలు ఉత్సాహంతో, ట్రాక్టరుపని చెయ్యటం చూశారు. లంక విషయంలో జమీందార్లనూ, మిల్లు యజమానికీ నడిచిన దావాలో తీర్పు మిల్లు యజమాని పక్షమయింది. ఈ సంగతి సునీతికీ, హేమాంగినికి కూడా ఇంకా తెలీదు – రాయ్ చెప్పలేదు.

ట్రాక్టరు దున్నటంచూసి వచ్చిన మానదా లంక కబుర్లన్నీ సునీతికి చెప్పింది.

సునీతి కంగారుగా, "హత్యలేమీ జరగలేదు గద?" అన్నది.

ఇంతలోనే రాయ్‌వెళ్ళి రంగ్‌లాల్ ముందుపళ్ళు రాలగొట్టాడు.

దావాలో తమ ఓటమితెలిసిన రాయ్, లంకను మరనాగళ్ళు దున్నుతున్నాయని విని, బాగ్దీలనూ, రైతులనూ పిలవమని మైత్రాను ఆదేశించాడు. రంగ్‌లాల్‌వచ్చి రాయ్‌కాళ్ళమీద పడ్డాడు.

"నీకేం భయంలేదు. లే, లే. మీరంతా ఊరికే పక్కన నిలబడండి. మిగిలిందంతా వస్తాదులు చేస్తారు," అన్నాడు రాయ్.

"మాకాళ్ళను మేమే నరుక్కున్నాం, బాబుగారూ!" అంటూ రంగ్‌లాల్ బావురుమన్నా.

"ఏం జరిగిందో చెప్పు, కాళ్లు విడిచిపెట్టు," అన్నాడు రాయ్.

పొలం పాలుకు తీసుకోవటానికి రైతులకు డబ్బిచ్చినవాడు మజుందారు వాళ్ళ ఆస్తులు తాకట్టుపెట్టుకుని డబ్బిచ్చాడు. సాలు


ఐటెక్స్

సౌందర్య సాధనములు




ఐటెక్స్ కాటుక
ఐటెక్స్ బింది
తిలకం
ఐటెక్స్ కుంకుమపేస్ట్

అరవింద్ లేబొరేటరీస్
పోస్టుబాక్సు 1415, మద్రాసు-17

కివ్వటం ముగిశాక రైతుల పాత భూములను విడుదలచేసి కొత్త భూములకు వేరే పత్రాలమీద సంతకాలు చేయించాడు: అదీ అయాక, "మీభూములు కొనేశాం!" అన్నాడు మజుందారు, ఆ పత్రాలు రిజిష్టరుకూడా అయాయి.

రాయ్ సహించలేక, కాలితో రంగ్‌లాల్‌ను మొహం పగిలేట్టు తన్నాడు. ముందుపళ్లు రెండూ ఊడాయి. రంగ్‌లాల్ ముఖం రక్తసిక్తమయింది.

తాను చేసినపనికి రాయ్ తరవాత పశ్చాత్తాపడ్డాడు. ఉమవచ్చి, "ఏంపని చేశావు, నాన్నా?" అంటే, "నాకు రోజులు నిండాయమ్మా!" అన్నాడు.

ఆయన ఉమతో మరో మాటకూడా అన్నాడు:

"అమ్మా, మీ అత్తవారికి నేను చాలా ద్రోహంచేశాను. నా ఆస్తిలో సగం నీభర్తకూ, బావగారికీ ఇద్దా మనుకుంటున్నాను."

"దాని కిప్పుడేం తొందర?" అన్నది ఉమ.

"నాకు మొహం చెల్లటంలేదు — లంకకు సంబంధించిన దావా లన్నిటిలోనూ మనం ఓడాం; ఆమాట నువు మీ అత్త మామలకు కాస్త చెబుతావా?" అని రాయ్ అడిగాడు, ఉమ నిట్టూర్చి, సరే సరేనన్నది.

లంకతో శాశ్వతంగా తమకు సంబంధాలు తెగిపోవటం సునీతికి ఇష్టమేగాని, ఆమెకులం వల్ల కలిగిన కష్టాలు తీరలేదు. మహేన్ ఇంకాజైలులోనేఉన్నాడు. ఆ లంకే తనను కోర్టుబోనులో నిలబెట్టింది.

ఇవాళే ఆమెకు అహీన్ గురించి ఉమ తనకు తెలిసిన విషయాలన్నీ చెప్పింది; అతను ప్రభుత్వంమీద విప్లవం సాగించే ఉద్యమంలో చేరాడు. మనుష్యులమధ్య వర్గా లుండరాదనీ, భూమీ సంపదాపైన అందరికీ హక్కుండాలనీ అతని నమ్మకం.

సునీతి ఈటలువిని వణికిపోయింది. అహీన్‌ను ఇంటికిరమ్మని బతిమాలుతూ ఎన్నో ఉత్తరాలు రాసిందామె. అతను రాలేదు సరే కదా, కలకత్తానుంచి అతను ఎటో వెళ్ళిపోయినట్టు వార్త వచ్చింది.

ఒకనాటి వానరాత్రి చీకటిలో అహీన్ తనతల్లినీ, భార్యనూ చూసి పోవటానికి వచ్చాడు. అతని బృందాన్ని పోలీసులు వేటాడుతున్నారు.

"నేను ఈరాత్రే వెళ్ళిపోవాలమ్మా. మా ఆచూకీ పోలీసులకు తెలిసింది." అన్నాడు తమ తల్లితో అతమ భోజంచేసి, ఉమ గదిలో పడుకున్నాడు. ఉమ ఏడుస్తుందని భయపడ్డాడు. కాని ఆమె ఏడవలేదు.

తెల్లవారు ఝామున సునీతివచ్చి పిలిచేసరికి ఉమ తనకు


ఐ.ఓ.బి స్నేహితులకు
ఖాతాదారులకు
డిపాజిటుదారులకు
సుఖసంపదలతో కూడిన
దీపావళి శుభాకాంక్షలు



ది ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ లిమిటెడ్
సెంట్రల్ ఆఫీసు: 151 మౌంటురోడ్డు, మద్రాసు-2.
R. N. చెట్టూరు, చెయిర్మన్ A. M. కదిరేశన్, జనరల్ మేనేజర్
IOB-4768

తెలియకుండానే నిద్రపోతున్నది. ఆమెలేచి భర్తను లేపింది. అహీన్ కిటికీతెరిచి బయటికి చూశాడు. తరవాత ఆపుకోలేని ఉద్వేగంతో భార్యను గాఢంగా కౌగలించుకుని, గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. తరవాత అతను వెళ్ళిపోయాడు.

ఉదయం పదిగంటలకు అహీన్ తిరిగి వచ్చాడు. అతనివెంట పోలీసులున్నారు. రైలుస్టేషన్లో అతను పట్టుబడ్డాడు. అతనిమీద ఉన్న చార్జీలు, విద్రోహమూ, ప్రభుత్వోద్యోగులపై హత్యా ప్రయత్నమూనూ.

అపరాహ్ణం మూడుదాకా పోలీసులు ఇల్లు సోదాచేశారు, ఇంద్ర రాయ్‌గారింటిని కూడా సోదాచెయ్యటం జరిగింది. పోలీసులు తరవాత అహీన్ చేతులకు బేడీలు తగిలించి, నడుముకు తాడుకట్టి తీసుకు పోయారు...

మహేన్ నవీన్ హత్యచేసి పోలీసు ఠాణాకు వెళ్ళినరోజు తిరిగి మళ్ళీ ప్రత్యక్షమయింది. ఉమను తల్లి వెంటపెట్టుకు పోయింది. సునీతి భర్తగదిలో నేలపైన, బోర్లాపడి నిశ్చేతనంగా ఉన్నది. రామేశ్వరుడు నిశ్చలంగా మంచంమీద కూర్చుని ఉన్నాడు. కింద మానదా ఏడుస్తున్నది.

అర్ధరాత్రి అయింది.

మంచంమీద అలాగే కూర్చునిఉన్న రామేశ్వరుడు, "నీళ్ళు," అన్నాడు. ఆయన ఆరోజు భోజనం చెయ్యలేదన్నది గుర్తుకొచ్చి సునీతి నొచ్చుకున్నది. ఉమ ఆయన భోజనాన్ని బల్లమీద మూతపెట్టి ఉంచి వెళ్ళిపోయింది. సునీతిలేచి, ఆయన భోజనమూ, మంచినీళ్ళు తెచ్చి ఆయన ముందుంచి, "తినండి," అన్నది.

రామేశ్వరుడు మంచినీళ్ళు తాగి, భోజనం పళ్ళాన్ని తోసి పుచ్చాడు.

సునీతి గట్టిగా ఏడ్చింది.

"అహీన్‌కు ఉరిశిక్ష వేస్తారా?" అని రామేశ్వరుడు మెల్లిగా అడిగాడు.

"లేదు. వాడు హత్యచెయ్యలేదు." అన్నది సునీతి.

"నీపుణ్యమూ, ఉమ భాగ్యమూ... మరి వాళ్ళు నన్నెందుకు శిక్షించరూ? అహీన్ నాకొడుకు. వాడితప్పు నాతప్పే." అన్నాడు రామేశ్వరుడు.

"మీతప్పుకాదు. నా గర్భదోషం అన్నది సునీతి."

రామేశ్వరుడు తల అడ్డంతిప్పి, "కాదు. నీకుతెలీదు. ఎవరికీ తెలీదు... రాధారాణినీ, ఆమెకొడుకునీ గొంతుపిసికి చంపేశాను నేను," అన్నాడు.



సునీతి బిత్తరపోయి. భర్త ముఖంకేసి చూసింది.

"ఓనాడు రాధామణి పుట్టింటో ఓ అందమైన కుర్రాడితో మాట్లాడటం కనిపించింది. ఆమె మేనత్తకొడుకు. నాప్రవర్తన మంచిదికాదు. అందుచేత ఆమెను శంకించాను...కొడుకు పుట్టాడు. నాపచ్చకళ్ళు, ఎర్రజుట్టూలేదు. వెర్రెత్తి పోయాను... ఆబిడ్డ నిద్రపోతూండగా వెళ్ళి గొంతు నులిమేశాను."

సునీతి వణికిపోతూ భర్తనోటికి చెయ్యి అడ్డంపెట్టి, "చెప్పకండి," అన్నది. కొంచెంసేపయాక ఆయన మళ్ళీ ప్రారంభించాడు.

"రాధారాణి కనుక్కున్నది. చూసిందేమోకూడా. కాని ఏడవలేదు. చెడునే చూసిన నా కళ్ళు పోతాయన్నది... ఒకనాడు కాశీ వెడుతున్నానని చెప్పి వెళ్ళిపోయింది, ఆ రాత్రే నేనామెను స్టేషనునుంచి ఇంటికి తీసుకొచ్చి, గొంతు పిసికి చంపేశాను. గొంతు పట్టుకున్నప్పుడు, 'కళ్ళు పోవటమేకాదు, రెండుచేతులకూ కుష్ఠుకూడా వస్తుంది', అని శాపించింది."

సునీతికి అంతా అయోమయంగాఉన్నది. "మీకు కళ్ళుపోలేదు, కుష్ఠు రాలేదు," అన్నదామె.

"పోయాయి. మహేన్, అహీన్ ఇద్దరూ బాగుచేశారు. ఈ చెయ్యి మహేన్, ఈ చెయ్యి అహీన్. నా రక్తదోషం, సునీతీ. మాది పాపిష్ఠి వంశం. అయితే నా పాపాలన్నీ నశించాయి. నా రోగాలన్నీ నయమయాయి."

సునీతి మనసు తాడుతెగిన గాలిపటంలా అయింది.

"మీరు నా సవతిని ఆ లంకలో పూడ్చారా?" అని ఆమె అడిగింది.

"లేదు. పెరటినూతిలో పూడ్పించాను."

తెల్లవారింది. అప్పుడే ఉదయిస్తున్న సూర్యకిరణాలలోకి తన చేతులు చాచి చూసుకుని రామేశ్వరుడు, "మచ్చలన్నీ పోయాయి!" అన్నాడు. ఆయన చేతులు జోడించి సూర్యుడికి నమస్కారం చేశాడు.

సునీతి కళ్ళనుండి అశ్రువులు స్రవించాయి. ★


## చక్కటి కురులకు సౌందర్య పోషణ

నిత్యమూ ఉదయాన్నే **'కేశవర్ధిని'** రాచుకొని తల దువ్వుకోండి—నిగనిగలాడుతూ ఎంతో చక్కని కురులు వర్థిల్లుతాయి, చుండు చేరదు. అందము, ఆరోగ్యకరములగు కురుల పెరుగుదలకు **'కేశవర్ధిని'** నే వాడండి.

అప్పటికప్పుడు తాజా వాడుకకు కేశవర్ధిని రెడీ మిక్స్డ్ హెరాయిల్

శుభ్రతకు, పరిమళయుతమైన కురులకు కేశవర్ధిని షాంపూ

## కేశవర్ధిని ప్రాడక్ట్సు

**27,** మాసిలామణి ముదలియార్ రోడ్డు, మదరాసు-**14.**



Printed and Published by A. Sudhakara Rao for Yuva Publications, Hyderabad-1
and printed at Yuva Press, Public Garden Road, Hyderabad-1. Phone : 36336
Controlling Editor : Sri "CHAKRAPANI".